

దర్శించండి - తరించండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి

శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్

A/c No. 30178925930, IFSC No. SBIN0010105

మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 28 | ది. 28-4-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 28 | Date : 28-4-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |




విశాఖ ఏ.యు. శతాబ్ది ఉత్సవాలలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కి స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు -విశాఖపట్నం, ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :

# విద్యుత్ కొనుగోలు చార్జీలను మరింతగా తగ్గిద్దాం : సి.ఎం.

- విద్యుత్ కొనుగోలు ఛార్జీలను యూనిట్‌కు రూ.4.60కు తగ్గించేలా ప్రణాళికలు
- రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యం
- ఇంధన రంగంలో పరిశోధనకు ప్రత్యేక ఎనర్జీ యూనివర్శిటీ
- ఈవీ వాహనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన
- పీఎం సూర్య ఘర్, కుసుమ్ పథకాల అమలులో లక్ష్యాలను చేరుకునేలా కార్యాచరణ
- విద్యుత్ శాఖ పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** ప్రజా ప్రయోజనాల కోసమే సంస్కరణలు తెస్తున్నామని ఆ సంస్కరణల అమలు కోసం టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసే అంశంపై నిరంతరం అధ్యయనం, జరుగుతూనే ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ పై సీఎం చంద్రబాబు సమీక్షించారు. వేసవిలో విద్యుత్ సరఫరా, 2026-27 ఏడాదిలో పవర్ ప్రొక్యూర్మెంట్ ప్లాన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించారు. వేసవిలో ప్రతి రోజూ 275 నుంచి 285 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటుందని అంచనా వేసినట్టు అధికారులు చెప్పారు. ఈ నెలలో ఇప్పటి వరకు 6397 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను వినియోగించు కున్నామని వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం మేర విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. విద్యుత్ వినియోగం పెరగడానికి వేసవితో పాటు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగిందని అధికారులు వివరించారు. వచ్చే ఆరు నెలల కాలానికి విద్యుత్ కొనుగోళ్ల ప్రణాళికలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. ఏప్రిల్ 2025లో విద్యుత్ కొనుగోలు ధర రూ. 5.20 ఉండగా.. మార్చి 2026 నాటికి రూ. 4.90కు తగ్గించామని అధికారులు చెప్పారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలవుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**పునరుత్పాదక విద్యుత్ పై దృష్టి..** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."విద్యుత్ కొనుగోళ్ల వ్యయం తగ్గాలి. ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో.. అలాంటి చర్యలన్నింటి పైనా అధికారులు దృష్టి పెట్టాలి. విద్యుత్ రంగంలో ఏయే దేశాల్లో ఎలాంటి కొత్త ఆవిష్కరణలు అమలు అవుతున్నాయో అధ్యయనం చేయాలి. ఈ ఏడాది చివరి నాటికి విద్యుత్ కొనుగోలు ధరను రూ. 4.60కు తగ్గించాలి. ఈ దిశగా విద్యుత్ శాఖాధికారులు దృష్టి సారించాలి. విద్యుత్ రంగంలో సహా ఏ రంగంలో నైనా ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతోనే సంస్కరణలు అమలు చేస్తున్నాం. ప్రజలకు మేలు చేయాలంటే టెక్నాలజీ వినియోగం అత్యంత అవసరం. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ నిరంతరం గుర్తు చేసుకోవాలి. విద్యుత్ లో రీసెర్చ్ అండ్ అనాలసిస్ కు పెద్ద పీట వేయాలి. దీని కోసం ట్రాన్స్ కో, జెన్కో వంటి సంస్థలు తమకున్న సీఎస్సార్ నిధులు కేటాయించాలి. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయింపులు జరిపేలా చర్యలు తీసుకుంటాం. పంప్డ్ స్టోరేజీ విధానంలో విద్యుత్ ఉత్పత్తిపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఎనర్జీ యూనివర్శిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. పొల్యూషన్ తగ్గేలా... పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలి. 2028-29 నాటికి సగాని పైగా విద్యుత్ ఉత్పత్తి రెన్యూవబుల్ ఎనర్జీ ద్వారా వచ్చేలా చూడాలి. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 52396 సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇచ్చాం. దీన్ని మరింత వేగవంతం చేయాలి. ఇకపై ప్రతి నెల 2 లక్షల పీఎం సూర్య ఘర్ కనెక్షన్లు ఇచ్చేలా చూడాలి. పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 2.94 లక్షల కనెక్షన్లు ఇచ్చాం. మొదటి విడత పీఎం కుసుమ్ పథకాన్ని డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలి.

# మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల బ్యాంకు రుణాలు ఇచ్చాం: సీఎం



**హైదరాబాద్,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** మహిళలకు ఓటు హక్కు ఇవ్వడానికి 150 ఏళ్లు పట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ "మహిళల ఓటు హక్కు కోసం అమెరికాలోనే చాలా సమయం పట్టింది. స్వాతంత్ర్యం రాగానే పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించారు. దేశ అభివృద్ధిలో మహిళలను భాగస్వాములను చేశారు. మహిళల ఆధ్వర్యంలో పాలనను కాంగ్రెస్ ప్రోత్సహించింది. చట్టాలు, శాసనాలు చేయడానికి మహిళలకు సంపూర్ణ అవకాశం ఇచ్చింది. మహిళలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వచ్చాయి. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ల ద్వారా అవకాశాలు. మహిళలకు అవకాశం ద్వారా పాలనలో భాగస్వామ్యం లభించింది. అసెంబ్లీ, లోక్‌సభలో మహిళలకు రిజర్వేషన్ల కోసం 2013లో రాజ్యసభలో బిల్లు ఆమోదం. ఇప్పటికీ మహిళల పట్ల సమాజంలో కొంత వివక్ష ఉంది. మహిళలకు రక్షణ, పిల్లలకు భద్రత కల్పించడం ప్రభుత్వం బాధ్యత. 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తున్నాం. డయల్ 100, 112 ద్వారా స్పందన బృందాలు 24 గంటలపాటు సేవలు. సమస్య వచ్చాక పరిష్కారం కాకుండా.. సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సరైన సమయంలో స్పందిస్తే మహిళలు వివక్ష ఎదుర్కొనే పరిస్థితి రాదు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట మంజూరు చేశాం. సంక్షేమ పథకం మహిళకు అందిస్తే కుటుంబ గౌరవాన్ని కాపాడుతుంది. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల బ్యాంకు రుణాలు ఇచ్చాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు సారె పేరుతో చీరలు అందిస్తున్నాం. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి రూ.10 వేల కోట్లు ఖర్చు పెట్టాం. మహిళా సంఘాల ద్వారా వెయ్యి బస్సులు కొనుగోలు చేస్తున్నాం. బస్సులను ఆర్టీసీకి లీజుకు ఇచ్చి మహిళలను బస్సులకు యజమానులను చేస్తున్నాం. సోలార్ ఎనర్జీ గురించి మాట్లాడితే మొదట వచ్చేది అదానీ, అంబానీ పేర్లు. స్వయం సహాయక సంఘాల ద్వారా వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి చర్యలు. వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే శక్తి మహిళలకు అందిస్తున్నాం. అదానీ, అంబానీలతో తెలంగాణ ఆడబిడ్డలు పోటీపడేలా చేస్తున్నాం" అని తెలిపారు.

# నా రాజకీయ జీవితానికి ఏయూనే పునాది: వెంకయ్యనాయుడు



**విశాఖపట్నం,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** వర్సిటీలు డిగ్రీలు, పట్టాలు, థీసిస్‌లకు పరిమితం కాకుండా పరిశోధన కేంద్రాలుగా మారాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలు నేర్పాలన్నారు. ఏయూ వందేళ్ల వేడుకలో పాల్గొన్న వెంకయ్యనాయుడు యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణ, ఆరోగ్యంపై విద్యార్థులు ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు.

**ఏయూలో వందేళ్ల పండుగ జరుగుతోంది: చంద్రబాబు..** ఆంధ్ర యూనివర్శిటీ దేశంలోనే టాప్-5లో ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఏయూకి ప్రభుత్వం నుంచి రూ.500 కోట్లు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఏయూ వందేళ్ల వేడుకలో పాల్గొన్న సీఎం వర్సిటీలు అంటే డిగ్రీలు, పట్టాలు ఇచ్చే కేంద్రాలు కాకుండా సమాజం కోరుకునే ఆవిష్కరణలకు వేదిక కావాలన్నారు. విద్యార్థులు సంపద సృష్టించే మార్గదర్శకులుగా తయారుకావాలని సూచించారు.

**ఏయూ నుంచి వచ్చిన అనేకమంది భిన్నరంగాల్లో రాణించారు: సచిన్..** క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ అన్నారు. లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఎన్ని కష్టాలు, సందేహాలు ఎదురైనా డీవియేట్ అవ్వకుండా మనస్సాక్షి చెప్పిందే చేయాలని సూచించారు. నిబద్ధతతో పని చేస్తే ఒత్తిడి అధిగమించవచ్చన్నారు. విశాఖ ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో అతిథిగా పాల్గొన్న సచిన్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

**ఏయూలో ఫిజిక్స్ చదువుకునేందుకు వచ్చి తెలుగు సాహిత్యం చదివా: త్రివిక్రమ్ శ్రీనివాస్..** నేను కూడా ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థినేనని సినీ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నారు. విభిన్న ఆలోచనలున్న వారిని ఒకచోటకు తీసుకొచ్చే కేంద్రమే వర్సిటీ అని త్రివిక్రమ్ వివరించారు. ప్రకృతిని మనం చూడటంలోనే తేడా ఉందన్న త్రివిక్రమ్, ఏయూని విశాలమైన ప్రాంగణంలో నిర్మించారని, ఇక్కడ చదువుకుని ఎందరో గొప్పవాళ్లు అయ్యారన్నారు. మనకు అలవాటు ఉన్నవే గొప్పవని మనం అనుకుంటామని, అయితే పదిమందిని కలవడం వల్లే గెలవాలన్న ఆలోచన పుడుతుందని త్రివిక్రమ్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఏయూలో ఫిజిక్స్ చదువుకునేందుకు వచ్చి తెలుగు సాహిత్యం చదివానని త్రివిక్రమ్ తెలియజేశారు. ఆంధ్రా యూనివర్సిటీ ఎంతోమందికి చోదకశక్తి ఇచ్చిందని త్రివిక్రమ్ శ్రీనివాస్ వెల్లడించారు.

# కొందరు నాయకులు ఇంకా అహంకారంతో వెళ్తున్నారు: కేసీఆర్



**హైదరాబాద్,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేసే వారికే టికెట్లు ఇస్తామని మాజీ కేసీఆర్ స్పష్టం చేశారు. ముఖాలు చూసి టికెట్లు ఇచ్చేది ఉండదని తేల్చి చెప్పారు. ఎస్ఐఆర్ విషయంలో అప్రమత్తంగా ఉండకపోతే నష్టపోతామని హెచ్చరించారు. కొందరు నాయకులు ఇంకా అహంకారంతో వెళ్తున్నారన్న ఆయన నాయకులు అందరినీ కలుపుకుని పోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇక నుంచి పూర్తి సమన్వయంతో ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ భేటీలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని బీఆర్?ఎస్? నాయకులకు పరిచయం చేశారు. ప్రధాన కార్యదర్శిగా జీవన్‌రెడ్డి సేవలు పూర్తిస్థాయిలో వినియోగించుకుంటామని కేసీఆర్ తెలిపారు. సమావేశంలో నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో ప్రజలకు పనికిరాని ప్రభుత్వం ఉందని, బీజేపీది మనువాద సిద్ధాంతమని, బీజేపీ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వదన్నారు.

**రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయింది: కేసీఆర్..** రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేతకావట్లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావట్లేదని, తెలంగాణ ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. ఇది చిల్లర ప్రభుత్వమని, ఆ మాటలు ఏంటని నిలదీశారు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, తేజస్వీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఒక్క మాటా మాట్లాడలేదని మండిపడ్డారు.


IN THE COURT OF THE HONμBLE II ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIJAYAWADA

I.P. No. 37 of 2025

Between:

K. Srinivasa Rao ------------Petitioner

AND

1. Varikuti Rama Krishna
2. Talari Ramana

---------Respondents

**RESPONDENT No 1:**

Varikuti Rama Krishna, S/o. Srinivasulu, R/o. D.No. 41-1/6-40, Gowthami Naar, 2nd Line, Opp: Srinivasas Towers, Krishnalanka, Vijayawada, NTR District -- 520013.

పై నెంబర్ దావా లోని మీరు ప్రతివాదిగా ఉన్నారు. శ్రీ కోర్టు సుమన్లు (Notice) పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తము ది. 06.05.2026 తేదీన వాయిదా వేసియున్నారు. కావున ఈ రోజు ఉదయం 10:30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా హాజరై ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకోవలెను. లేనిచో ఈ దావా మీకు పరోక్షముగా తీర్మానించబడును.

//శ్రీ కోర్టు వారి అనుమతితో//

వాయిదా తేదీ : 06.05.2026

ఇట్లు

**MATHI SYAM,**

Advocate

D.No: 30-9-7, A.B. Homes, F.F.-2, Namburi Vaari Veedhi, Durga Agraharam, Vijayawada-2

Cell No: 9297051666


# నాలాంటి వాళ్లకు ఇదొక ఎమోషన్: మంత్రి నారా లోకేశ్

- ఆంధ్రా యూనివర్సిటీ ఒక సంస్థ మాత్రమే కాదు.. ఒక ఎమోషన్ అన్న మంత్రి నారా లోకేష్
- దేశంలోనే ఏయూకు ఓవరాల్‌గా 3వ ర్యాంక్ సాధించడమే లక్ష్యం
- ఏడాదిలోగా యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కరిక్యులమ్‌లో మార్పులు తెస్తామని వెల్లడి



**విశాఖపట్నం,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) కేవలం ఒక విద్యాసంస్థ మాత్రమే కాదని, తన లాంటి వారికి అదొక ఎమోషన్ అని, ఇది ఆంధ్రప్రదేశ్‌కే కాక యావత్ భారతదేశానికే గర్వకారణమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమవారం విశాఖపట్నంలోని ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో అత్యంత వైభవంగా జరిగిన విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో లోకేష్ కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. "శతాబ్ద కాలంగా విజ్ఞాన కాంతులు పంచుతున్న ఏయూ గొప్పదనాన్ని జరుపుకోవడం గర్వంగా ఉంది. 2014లో రాష్ట్రం విడిపోయినప్పుడు రాజధాని, సచివాలయం, కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా లేని నిస్సహాయ స్థితిలో ఉన్నాం. కట్టుబట్టలతో మనల్ని బయటకు గెంటేశారు. ఆనాడు మనకున్నవి రెండే ఆస్తులు. ఒకటి ఆంధ్రా యూనివర్సిటీ, రెండు మన బ్రాండ్ సీబీఎన్. రాష్ట్ర విభజన తర్వాత మొదటి కేబినెట్ సమావేశం పెట్టుకోవడానికి కూడా చోటులేని పరిస్థితుల్లో ఏయూనే మాకు ఆశ్రయమిచ్చింది. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు తొలి అసెంబ్లీ సమావేశాలు కూడా ఇక్కడే జరిగాయి.


## పాస్‌పోర్టు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ అర్బన్, అజిత్‌సింగ్‌నగర్, నందమూరినగర్, తోటవారి వీధి, డోరు నెం.43-106/1-54ఎ కాపురస్తుడు వేము పెద్దవెంకటేశ్వరరావు గారి కుమారుడు వేము రాంబాబు అను నేను విజయవాడలో ది.04-10-2024న జారీచేసిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.సి3013643 మరియు కొన్ని కాగితములు కలిగిన కవర్‌తో ఉన్నటువంటి ఫైల్‌ను ది.04-12-2025వ తేదీన నందమూరినగర్, వశిష్ట కాలనీలోకి ఇల్లు మారే సందర్భంలో రోడ్డుపై జారిపడిపోయినవి. సదరు పాసుపోర్టు అవసరమై ఇంట్లో ఎక్కడ వెదకిననూ కనిపించలేదు. సదరు పాస్‌పోర్టును ఉపయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పాసుపోర్టు దొరికినయెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 9908655250



# వందేళ్ల వేడుక రోజు చెబుతున్నా... రాబోయే వందేళ్లలో ఏయూ చరిత్ర సృష్టిస్తుంది: సీఎం చంద్రబాబు

- ఏయూ శతాబ్ది వేడుకల ముగింపు కార్యక్రమం
- సీఎం చంద్రబాబు ఉత్తేజపూరిత ప్రసంగం
- యూనివర్సిటీ అభివృద్ధికి రూ.112 కోట్ల విలువైన 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన
- గత వైభవాన్ని స్మరిస్తూనే భవిష్యత్‌కు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



**విశాఖపట్నం,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** "వంద సంవత్సరాల వేడుక రోజు చెబుతున్నా, రాబోయే వంద సంవత్సరాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) మరో సరికొత్త చరిత్రను సృష్టిస్తుంది... ప్రపంచంలోనే ఓ ఉత్తమ బ్రాండ్‌గా నిలుస్తుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో జరిగిన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థుల ఉత్సాహాన్ని చూస్తుంటే వారి ఆనందం ఆకాశాన్ని తాకుతోందని అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వందేళ్ల ఏయూ పండుగ ఒక చారిత్రక ఘట్టమైతే, ప్రపంచ టెక్నాలజీ దిగ్గజం గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేయడం మరో చరిత్ర అని అన్నారు. గూగుల్ కంటే ముందే ఏయూ తన ఖ్యాతితో ప్రపంచాన్ని విశాఖతో అనుసంధానం చేసిందని, వివిధ దేశాల విద్యార్థులు ఇక్కడ చదవడం రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు. రాష్ట్ర విభజన తర్వాత మొట్టమొదటి కేబినెట్ సమావేశాన్ని ఏయూలోనే నిర్వహించామని, ఇది ఈ వర్సిటీకున్న ప్రత్యేకతను చాటుతోందని గుర్తుచేశారు. ఏయూ చారిత్రక నేపథ్యాన్ని, దానికి సేవ చేసిన మహానుభావులను చంద్రబాబు స్మరించుకున్నారు. స్వాతంత్ర్య పోరాటం కంటే ముందే ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయ అభివృద్ధికి జైపూర్ రాజా విక్రమ దేవ్, గజపతి, పిఠాపురం, బొబ్బిలి రాజవంశీయులు చేసిన కృషిని మర్చిపోలేమని అన్నారు.

# ఉపముఖ్యమంత్రి చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మధుసూదన్ ఆకస్మిక మృతి



**హైదరాబాద్, ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** ఉపముఖ్యమంత్రి చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మారబోయిన మధుసూదన్ తీవ్రమైన గుండెపోటుతో అపోలో స్పెక్ట్రా ఆసుపత్రిలో మరణించారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి సంస్థలలో సీనియర్ జర్నలిస్టుగా కీలక బాధ్యతలను గతంలో ఆయన నిర్వహించారు. విధి నిర్వహణలో నికార్సైన పాత్రికేయుడిగా పనిచేశారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం చాతి నొప్పితో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సమయంలో కార్డియాక్ అరెస్టు కావడంతో సమీపంలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స నిర్వహిస్తున్న సమయంలో మరో మారు కార్డియాక్ అరెస్ట్ కావడంతో మృతి చెందారు. మారబోయిన మధుసూదన్ మృతి పట్ల ఉపముఖ్యమంత్రి బట్టి బట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అత్యంత నిజాయితీ గల పాత్రికేయన్ని కోల్పోవడం బాధాకరంగా ఉందని ఆయన అన్నారు. వృత్తిపట్ల అద్దం అత్యంత నిబద్ధత కలిగిన పాత్రికేయుడని ఉపముఖ్యమంత్రి చెప్పారు. ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి ఆత్మస్థైర్యం కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి అండగా అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

# ధరలు పెరుగుతాయనే ఆందోళన వద్దు...

**● అనవసర కొనుగోళ్లతోనే ఇబ్బందులు... ● ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయి... ●ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా**



**విజయవాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** కొన్ని రాష్ట్రాలలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఇంజనం ధరల్లో విపరీతమైన మార్పులు వస్తాయని సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్న అసత్య ప్రచారం కారణంగా వాహనదారులు ఆందోళనతో చేస్తున్న అనవసర కొనుగోళ్లతోనే ప్రస్తుతం ఇంధన ఇబ్బందులు ఎదురయ్యాయని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా అన్నారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె జిల్లాలోని ఇంధన పరిస్థితిపై వివరించారు. జిల్లాలో ప్రస్తుతం మొత్తం 186 పెట్రోల్ బంకుల ద్వారా పెట్రోల్ మరియు డీజిల్ సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని, ఎటువంటి కొరత లేదని ఆమె స్పష్టం చేశారు. సాధారణ పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం సుమారు 20 శాతం అదనంగా ఇంధన సరఫరా జరుగుతోందని తెలిపారు. కొండపల్లి ప్రాంతంలోని సరఫరా సంస్థలతో ఇప్పటికే చర్చలు జరిపి, జిల్లాకు అవసరమైన మేరకు ఇంధనాన్ని నిరంతరం అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎన్నికల అనంతరం పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని, కొరత ఏర్పడుతుందనే అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని, ప్రజలు ఇటువంటి వదంతులను నమ్మవద్దని ఆమె స్పష్టంగా సూచించారు. కేంద్ర పెట్రోలియం శాఖ కూడా ధరల పెరుగుదలపై వస్తున్న ప్రచారాలను ఖండించిందని తెలిపారు. ఇటీవలి రోజుల్లో ప్రజలు అవసరానికి మించిన స్థాయిలో ఇంధనాన్ని కొనుగోలు చేయడం వల్ల ఒక్కసారిగా 30 నుంచి 50 శాతం వరకు డిమాండ్ పెరిగిందని పేర్కొన్నారు. అందరూ ఒకేసారి ఫుల్ ట్యాంక్ చేయించుకోవడం వల్ల కొంతమంది బంకుల్లో తాత్కాలికంగా "నో స్టాక్" బోర్డులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అయితే ఇది సరఫరా లోపం వల్ల కాకుండా ప్రజల ఆందోళన కారణంగా మాత్రమే ఏర్పడిన తాత్కాలిక సమస్య అని స్పష్టం చేశారు. ప్రతి పెట్రోల్ బంక్ వద్ద క్రమబద్ధంగా సరఫరా జరిగేలా క్యూలైన్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. బంకుల వద్ద పోలీస్ మరియు రెవెన్యూ అధికారుల సమక్షంలో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని చెప్పారు. ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసి, జిల్లాలోని అన్ని బంకుల పరిస్థితిని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నామని వెల్లడించారు. వ్యవసాయం, ఆక్వా రంగం, ఆస్పత్రులు మరియు అంబులెన్స్ అవసరాలను ప్రధాన ప్రాధాన్యతగా గుర్తించి డీజిల్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. కమర్షియల్ డీజిల్ వినియోగదారులు కూడా రిటైల్ బంకుల వైపు రావడం వల్ల కొంతమేర డిమాండ్ పెరిగిందని చెప్పారు. ప్రైవేట్ పెట్రోల్ బంకుల్లో కొంతమేర అధిక ధరలు వసూలు చేస్తున్న అంశాన్ని గమనించామని, దీనిపై సంబంధిత అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బంకు యజమానులు పూర్తి స్థాయిలో చెల్లింపులు చేస్తున్నారని, ఆయిల్ కంపెనీలు కూడా అదనపు సరఫరా అందిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఆదండ్ల మనోహర్ వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సరఫరా సమృద్ధిగా ఉన్నందున ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. మరో ఒకటి లేదా రెండు రోజుల్లో పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుంటుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలు పానిక్‌కు గురికాకుండా, అవసరానికి తగినంత మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందరూ ఒకేసారి ఫుల్ ట్యాంక్ చేయించుకోవడం వల్ల తాత్కాలిక ఇబ్బందులు తలెత్తే అవకాశముందని హెచ్చరించారు. జిల్లాలో ఎటువంటి సమస్యలు తలెత్తిన పక్షంలో ప్రజలు జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 9154970454 ను సంప్రదించవచ్చని సూచించారు.

## వర్సిటీ శత జయంతి ఉత్సవాలలో భూపతిరాజుకు స్థానం గర్వకారణం



**కాకినాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** ఆంధ్రా యూనివర్సిటీ శతజయంతి ఉత్సవాలలో యూనివర్సిటీ స్థాపనలో ఆద్యులు తమ పూర్వీకులు, ముత్తాత భూపతిరాజు వెంకటపతి రాజుకు ప్రాధాన్యత ఇచ్చి గౌరవించడం సంతోషం కలిగించిందని తూరంగి గ్రామ మాజీ సర్పంచి అద్దూరి ఫణీశ్వర రవిరాజ్ కుమార్ అన్నారు.శత జయంతి ఉత్సవాలు సందర్భంగా భూపతిరాజు వెంకటపతి రాజు జ్ఞాపకాలను మీడియాకు వెల్లడించారు.1874లో జన్మించిన ఆయన బియల్ డిగ్రీ పొంది న్యాయవాదిగా ప్రాక్టీసు చేసి సమాజంలో ప్రముఖ వ్యక్తిగా ఎదిగారని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో శతజయంతి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆయనకు సముచిత స్థానం కల్పించిన ప్రభుత్వం,వర్సిటీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ముత్తాత భూపతిరాజు వెంకటపతి రాజు ఆరోజుల్లో ప్రముఖ న్యాయవాదిగా, అభ్యుదయ వాదిగా పలు సంస్కరణలు అమలు చేశారని తెలిపారు.నాటి బ్రిటీష్ పాలకులు,12జిల్లాల భూస్వాములు తమ ముత్తాతగారిని మద్రాస్ ప్రెసిడెన్సీకి లేజిస్లేసివ్ కౌన్సిల్ సభ్యునిగా రెండు సార్లు నామినేట్ చేశారన్నారు.కుగ్రామంగా ఉన్న విశాఖపట్నం నగరంగా ఏర్పాటు కావడానికి పలు గ్రామాలు విలీనం చేసి నేడు మహానగరంగా రూపాంతరం చెందడానికి ఆద్యులు అన్నారు.నాటి పాలకులను ఒప్పించి ఆంధ్రా యూనివర్సిటీ ఏర్పాటుకు విశేష కృషి చేశారన్నారు.తొలి విశాఖపట్టణం మునిసిపాలిటీకి రెండు దఫాలు ఛైర్మన్ గా ఎంపికై అభివృద్ధికి దోహదం చేశారన్నారు. సంస్థానాల విలీన సమయంలో విజయనగరం రాజుల ఆస్తులు కాపాడి మాన్సాస్ ట్రస్టు ఏర్పాటుకు కృషి చేశారన్నారు. భూదానోద్యమ సమయంలో ఆచార్య వినోభాభావే పిలుపు మేరకు సుమారు 600ఎకరాలు దానం చేసిన దాత. శతజయంతి ఉత్సవాలలో ఆయన ప్రస్తావన తీసుకురావడం పట్ల ఆయన వారసులుగా సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు.అద్దూరి రామకృష్ణ భాస్కర్ రాజు,అవ్యక్త అద్దూరి తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ పై ఆందోళన పడవద్దు: కలెక్టరు రావిరాల మహేష్



**అమలాపురం,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** డీజిల్,పెట్రోల్ కొరతపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్.బి ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరు రావిరాల మహేష్ కుమార్ స్పష్టం చేశారు.అపోహలను నమ్మవద్దని ప్రజలను కోరారు. డీజిల్, పెట్రోల్ సరఫరాపై తలెత్తిన అనుమానాల నేపథ్యంలో జిల్లా కలెక్టరు కార్యాలయంలో కలెక్టరు మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, జాయింట్ కలెక్టరు వైఖోమ్ నిడియా దేవి సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని పెట్రోల్ బంకులు సాయంత్రం 7 గంటల వరకు సాధారణ స్థితికి వస్తాయని తెలిపారు.మొత్తం 25 బంకులలో కొంత మేరకు సుమారు 2 వేల లీటర్ల లోటు ఉన్నప్పటికీ,పూర్తిగా డ్రై అవుట్ అయిన బంకులను గుర్తించి వాటి యాజమాన్యాలతో మాట్లాడుతున్నామని చెప్పారు.

## ఆయిల్ బంకులను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎస్ పి



**పెడన,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** జిల్లాలో డీజిల్, పెట్రోలు కొరత ఉందంటూ ప్రజలు భయాందోళనకు గురి కావద్దని, ఎవరు కూడా అవసరానికి మించి ఎక్కువగా నిల్వలు పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హెచ్చరించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ వీ. విద్యాసాగర్ నాయుడు తో కలిసి పామర్రు, గూడూరు మండలాలు, మచిలీపట్నం నగరంలో పెట్రోల్ బంకులను ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలుత జాతీయ రహదారి మార్గంలో పామర్రు మండలంలోని కురుమద్దాలి రెహమాన్ బీపీసీఎల్ పెట్రోల్ బంక్ తదుపరి జుజ్జువరం శ్రీ లక్ష్మీ నరసింహ బిపిసిఎల్ పెట్రోల్ బంకులను ఆకస్మిక తనిఖీ చేశారు. పెట్రోల్ బంక్ లోని డీజిల్ ఆయిల్ సరఫరా నమోదు చేసే రిజిస్టర్లను పరిశీలించారు.సంబంధిత యజమానులు రెహమాన్ , పవన్ కుమార్ లతో కలెక్టర్, ఎస్పీ నేరుగా మాట్లాడారు. అడిగినంత డీజలు, పెట్రోలు రావడంలేదని మరి ముఖ్యంగా డీజిల్ తగ్గించి సరఫరా చేస్తున్నారని, ఇంకొక చోట అసలు డీజిల్ తీసుకురావడానికి వెళ్లిన వాహనం ఇంకా ఇంతవరకు రాలేదని పెట్రోల్ బంక్ యజమానులు చెప్పడంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత బిపిసిఎల్ సేల్స్ అధికారులతో సెల్ఫోన్లో నేరుగా మాట్లాడారు. వెంటనే డీజల్ వాహనాలను పంపించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ యుద్ధం నేపథ్యంలో డీజిల్ పెట్రోల్ ఆయిల్ దొరుకుతుందో లేదో అని భయాందోళనతో కొంతమంది ప్రజలు అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారని, అంతే కాకుండా ఆదివారం సాధారణంగా డీజిల్ ఆయిల్ సరఫరా ఉండదన్నారు. ఈ సమస్యలు కలిసి రావడం వలన అక్కడక్కడ కొంత ఇబ్బంది వచ్చిందన్నారు. వాస్తవానికి జిల్లాలో డీజిల్ కొరత లేదని స్పష్టం చేశారు ఇప్పటికే జిల్లా కేంద్రంలో ఒక వార్ రూము ఏర్పాటు చేశామని డీజిల్ , పెట్రోల్ కొరతపై ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాస్తవంగా డీజల్ అందించే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఆయిల్ కంపెనీ మార్కెటింగ్ యజమానులందరితో మాట్లాడామని ఇప్పటికే డీజిల్ సరఫరా మొదలైందన్నారు డీజిల్ ఆయిల్ కావాల్సినంత సరఫరా చేయడం జరుగుతుందని, ప్రజలు ఎవరూ కూడా భయాందోళనకు గురికావద్దన్నారు. ఎవరైనా అవసరానికి మించి అధికంగా పెట్రోలు డీజిల్ నిల్వ చేసుకుంటే అటువంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తదుపరి జాతీయ రహదారి మార్గంలో గూడూరు లోని ఐఓసీఎల్ గోల్డ్ ప్రిన్స్ పెట్రోల్ బంక్ ను కలెక్టర్, ఎస్పీ తో కలిసి తనిఖీ చేశారు. పెట్రోల్ బంక్ మేనేజర్ దామోదర్ తో మాట్లాడి డీజిల్ పెట్రోల్ స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ ఉందని వినియోగదారులకు సజావుగా పంపిణీ చేస్తున్నామని అతను కలెక్టర్కు వివరించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ అక్కడి వినియోగదారులతో ముఖాముఖి మాట్లాడారు. డీజలు, పెట్రోలు అవసరం ఉండి తీసుకుంటున్నారా లేక ఆందోళన చెంది తీసుకుంటున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందరూ అవసరం ఉండి తీసుకుంటున్నామని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి ఆయిల్ కంపెనీ లారీ టాంకర్ల డ్రైవర్లతో కూడా కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. గతంలో ఎలా సరఫరా చేస్తున్నారు, ఇప్పుడు ఎలా సరఫరా చేస్తున్నారు, ఎంత సమయం పడుతుంది అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదనంతరము మచిలీపట్నం నగరంలోని రేవతి సెంటర్ వద్ద ఉన్న హెచ్పీసీఎల్ డీలర్ బాలేశ్వరరావుకు చెందిన పెట్రోల్ బంకును కలెక్టర్ ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు.అక్కడ స్టాక్ లేదని గమనించి కలెక్టర్ మేనేజర్ రాముతో వివరాలు అడిగి తెలుసుకున్నారు దీంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత సేల్స్ అధికారితో మాట్లాడి వెంటనే స్టాకు పంపించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ ఎస్పీ వెంట డిఎస్ఓ మోహన్ బాబు, ఉయ్యూరు ఇంచార్జ్ ఆర్డిఓ, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు తహసిల్దార్ రవికాంత్, మచిలీపట్నం సిఐ అబ్దుల్ నబీ, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## అవయవదానంపై పీఎంపీలు చేస్తున్న సేవలు అభినందనీయం

**● జిల్లా కలెక్టరు ఎమ్ ఎన్ హరేంద్రప్రసాద్**



**కాకినాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** గ్రామాల్లో, పట్టణ మురికివాడల్లో ప్రజలకు ఎల్లప్పుడూ చేరువలో ఉండే పీఎంపీలు ప్రథమచికిత్సలే అందించాలని కాకినాడ జిల్లా కలెక్టరు ఎమ్ఎన్ హరేంద్రప్రసాద్ అన్నారు.కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా కలెక్టరు ఎమ్ఎన్ హరేంద్రప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర స్థాయిలో పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవయవదానం పై అవగాహన కల్పిస్తున్న పోస్టర్స్ ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న పీఎంపీలను అభినందిస్తూ అవయవదానంపై అపోహలు వీడి అవయవదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చేలా గ్రామాల్లో అవగాహన పెంచాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ప్రజా ఆరోగ్య కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు,పీఎంపీలందరూ తమ పరిధిలోనే సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి తనిషా,కాకినాడ సిటీ అధ్యక్షులు సిహెచ్. ఏడుకొండలు,కార్యదర్శి కె. శ్రీనివాసరావు,కాజులూరు మండల అధ్యక్షులు జేవీవీ సూర్యనారాయణ, కాజా, ఎస్వీ.రామారావు లతో పాటు పిఎంపి సభ్యులు పాల్గొన్నారు.

## ఐడియా సేవా సంస్థలో మూడవ రోజు, వేసవి శిక్షణ శిబిరాలు..



**తిరువూరు,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** ది 27.04. 2026 ను ఎన్టీఆర్ జిల్లాలో తిరువూరు రాజుపేట బస్టాండ్ ఔట్ గేట్ దగ్గర గల ఐడియా సేవా సంస్థలో ఐడియాస్ ప్రాంగణంలో మూడవ రోజు వేసవి శిక్షణ శిబిరాలని ఈ రోజు నిర్వహించినారు.సంస్థ డైరెక్టర్ అవ్వారి శౌరి మాట్లాడుతూ, ఈ రోజు పిల్లలు అందరూ మాట్లాడి, వారిలో ఉన్న బిడియం, భయం పోగొట్టుకున్నారు. నిమ్మకాయల స్పూన్ పై పెట్టుకుని ఆడినా ఆటలో గెలిసిన చిన్నారులకు బహుమతులు అందచేసారు. 32 మంది పిల్లలు ఈ వేసవి శిక్షణ శిబిరమునకు హాజరైనారు. పోలిశెట్టి పాడు నుండి వజ్రాల రామకృష్ణ రెడ్డి మరియు శ్రీమతి లలిత వివాహ వార్షికోత్సవము సందర్భముగా అన్నదానం చేశారు. సంస్థ వారు, వారికి ధన్యవాదాలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అవ్వారి శౌరి, కోఆర్డినేటర్ బొగ్గుల కోటేశ్వర్ రెడ్డి, పిట్ట మాధవరావు, కేసరి రాజేశ్వరి , వాలంటీర్లు రమాదేవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జనగణన 2027 -- ఆన్‌లైన్ నమోదు ప్రతి పౌరుడి బాధ్యత - డా. జి. సమరం




**విజయవాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** భారత ప్రభుత్వం చేపడుతున్న జనగణన--2027 కార్యక్రమంలో భాగంగా ఈసారి సాంకేతికతను వినియోగిస్తూ ఆన్‌లైన్ నమోదు విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ప్రముఖ వైద్యులు, సామాజిక చైతన్యవేత్త డాక్టర్ జి. సమరం తెలిపారు. ప్రతి పౌరుడు ఏప్రిల్ 30, 2026లోపు తప్పనిసరిగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. విజయవాడలోని వాసవ్య నర్సింగ్ హోంలో సోమవారం ఉదయం జనగణన--2027 ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జనగణన దేశ అభివృద్ధికి పునాది వేస్తుందన్నారు. జనాభా, విద్య, ఆరోగ్యం, ఉపాధి, నివాస పరిస్థితులు వంటి కీలక అంశాలపై ఖచ్చితమైన సమాచారం సేకరణ ద్వారా ప్రభుత్వానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించడానికి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి ఇది కీలకమని వివరించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ నమోదు విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శిస్తూ, మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా లాగిన్ కావడం నుంచి వివరాలను నమోదు చేసే విధానం వరకు అడుగు అడుగుగా వివరించారు. సరైన సమాచారం ఇవ్వడం ఎంత ముఖ్యమో కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రదర్శన సభికులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. జనగణనలో తప్పు సమాచారం ఇవ్వడం వల్ల ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందకపోవచ్చని హెచ్చరించిన డాక్టర్ సమరం, సమాజ అభివృద్ధి, సమాన వనరుల పంపిణీ, భవిష్యత్ ప్రణాళికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ నిజమైన, ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రజలందరూ చైతన్యంతో ముందుకు వచ్చి ఆన్‌లైన్ నమోదు పూర్తి చేసి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త డి. రవి కుమార్ కూడా పాల్గొని ఆన్‌లైన్ నమోదు విధానాన్ని సభికులకు ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమానికి హాజరైన వారు తమ మొబైల్ ఫోన్ల ద్వారా నమోదు ప్రక్రియపై ఉన్న సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

## రెవెన్యూ కనుసన్నలలో రైతన్నలకు అందుబాటులో డీజిల్ సరఫరా - జిల్లా కలెక్టర్ లక్ష్మీశా



**విస్సన్నపేట,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో పెట్రోల్ డీజిల్ చేయిస్తున్న బంకులను జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పర్యవేక్షించారు. వ్యవసాయానికి సంబంధించి అందరికీ డీజిల్ అందుబాటులోకి తేవాలనే లక్ష్యంగా ప్రతి బంకు వద్ద ఒక విఆర్ఓ ఒక విఆర్ఏకు అదనపు డ్యూటీలు వేసి రైతులకు ఇబ్బందులు లేకుండా డీజిల్ అందిస్తున్నామన్నారు. ట్రైట్ అనే ప్రచారం వలన అవసరం లేని వారు కూడా బంకుల వద్దకు రావడంతో బారులు తీరిన పరిస్థితి కనపడుతుందన్నారు. వ్యవసాయం చేసే వారందరికీ గుర్తించి రెవెన్యూ ఆధ్వర్యంలో డీజిల్ అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కుమార్ మండల తాసిల్దారికే లక్ష్మీ కళ్యాణి ఏవో రాజలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మే 4 తేదీ నుంచి ఆత్మీయ, ఆరోగ్య, ఆర్థిక, అభివృద్ధి పండుగలు - డాక్టర్ పి.సతీష్ కుమార్ రాక




**కాకినాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** కాకినాడ మెక్లారిన్ మైదానం వేదికగా మే 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఆత్మీయ, ఆరోగ్య, ఆర్థిక అభివృద్ధి పండుగలు నిర్వహించడం జరుగుతుందనీ కల్వరి టెంపుల్ నిర్వాహకులు తెలిపారు.ఈ పండుగలలో కల్వరి టెంపుల్ వ్యవస్థాపకులు దైవజనులు డాక్టర్ పి.సతీష్ కుమార్ విచ్చేసి దైవ సందేశం అందిస్తారని కాకినాడ జిల్లా వాసులు ఈ పండుగల్లో పాల్గొని దైవాశీర్వాదాలు పొందాలని కాకినాడ కల్వరి టెంపుల్ నిర్వాహకులు కోరారు.

## పెట్రోల్ బంకు యాజమాన్యాలకు భారీ షాక్ ఇవ్వనున్న ఏపీ ప్రభుత్వం



**అమలాపురం,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** ఏపీలో పెట్రోల్ బంకు యాజమాన్యాలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమయింది. ఇక నుంచి ఉద్దేశపూర్వకంగా పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టించే పెట్రోల్ బంకు నిర్వాహకులకు భారీ జరిమానా విధించేందుకు సిద్ధమవుతుంది. పద్ధతి మార్చుకోకపోతే పెట్రోల్ బంకును సీజ్ చేసేందుకు వెనకాడబోమని ప్రభుత్వం వార్నింగ్ ఇస్తుంది. యుద్ధం బూచిగా చూపిస్తూ పెట్రోల్,డీజిల్ కొరతను పెట్రోల్ బంకుల నిర్వహకులు సృష్టిస్తున్నారు. పెట్రోల్ , డీజిల్ ను బ్లాక్ మార్కెట్లో విక్రయించుకొని సొమ్ము చేసుకునేందుకు నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిశాయి. దీంతో ధరలు కూడా పెరుగుతాయని వార్తలు షికారు చేయడంతో పెట్రోల్ బంకుల యాజమాన్యాలు లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయి. వీటన్నిటికీ ఏపీ ప్రభుత్వం చెక్ పెట్టేందుకు కఠిన చర్యలకు సిద్ధమవుతుంది.

## లయన్స్ ఇంటర్నేషనల్ జోన్ చైర్ పర్సన్ గా ఆర్కాట్ కృష్ణ ప్రసాద్



**తిరుపతి,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 317ఇ కన్వెన్షన్ కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు బెంగళూరులో డిస్ట్రిక్ట్ గవర్నర్ అశ్వత్ నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా మరియు కర్ణాటక జిల్లాల లయన్స్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో డిస్ట్రిక్ట్ 317ఇ గవర్నర్ ఎలెక్ట్‌గా ప్రతాప్ యాదవ్, మొదటి వైస్ గవర్నర్‌గా రంగారెడ్డి, రెండవ వైస్ గవర్నర్‌గా సుగాత్రి రెడ్డి ఎన్నికై విజేతలుగా ప్రకటించబడ్డారు.అలాగే 2026--2027 సంవత్సరానికి గాను జోన్ చైర్‌పర్సన్‌గా తిరుపతికి చెందిన ఆర్కాట్ కృష్ణ ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎలెక్ట్ గవర్నర్ ప్రతాప్ యాదవ్ వెల్లడించారు.ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. లయన్స్ క్లబ్బుల ద్వారా పేదలు, అనాథలకు మరింత సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు మోహన సుందరం, మక్కిన భాస్కర్, రామచంద్ర రెడ్డి, సోమయ్య, ముబారక్, చిట్టిబాబు రెడ్డి, మునికృష్ణమనాయుడు, బండి మధుసూదన్ రెడ్డి, గోకుల్, కోలా సురేష్, వనద్రి, ఈశ్వర్ రెడ్డి, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు



**కిర్లంపూడి,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** కిర్లంపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. వేద పండితులు చక్రవర్తుల రాఘవాచార్యులు, ఆలయ అర్చకులు గోవర్ధనం సత్య వెంకట నాగాచార్యులు, ప్రవచనకర్త పసుమర్తి వెంకట దుర్గా సుబ్రహ్మణ్యం కలిసి ఈ వేడుకలను నిర్వహించారు. ముందుగా శ్రీ చక్రమునకు పంచామృత అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం సామూహికంగా మహిళలచే వాసవీ వ్రతకల్పం, కుంకుమార్చన,లలితా సహస్రనామ పారాయణ, శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కిర్లంపూడి,ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల నుండి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ,యూత్ కమిటీ కలిసి ప్రవచనకర్త అయినటువంటి పసుమర్తి వెంకట దుర్గా సుబ్రహ్మ ణ్యంను పూలమాలలతోను, దుస్సాలువతోను ఘనంగా సత్కరించారు. కమిటీ వారు భక్తజనుల సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని విందు స్వీకరించారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యము లేకుండా జయంతి వేడుకలకు ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## రాంచందర్ రావు జన్మదిన వేడుకలు: పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 27, (వార్తాప్రభ) :** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్ పరిధిలోని మీనాక్షి ఎస్టేట్స్‌లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది.

**సేవలో భాగస్వాములైన నాయకులు** ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి లిలిచెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు జన్మదినం సందర్భంగా సామాజిక బాధ్యతగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సమాజ సేవలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. ఈ సేవా కార్యక్రమంలో పార్టీ నాయకులు ఝాన్సీ, నల్లనాగుల కృష్ణా, పోల గంగాధర్, ప్రవీణ్ గౌడ్, రాజేష్, ప్రహ్లాద్, రవీందర్ రెడ్డి, చైతన్యతో పాటు పెద్ద సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. రాంచందర్ రావు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## గణేష్ నాయక్ కు దళిత రత్న అవార్డు ప్రదానం





**హైదరాబాద్ ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి):** మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ మల్లికార్జున్ నగర్ కు చెందిన గణేష్ నాయక్ దళిత రత్న అవార్డు లభించింది. ఇటీవల బాబు జగ్జీవన్ రావ్ మరియు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అవార్డుల ప్రధానోత్సవం లో భాగంగా గణేష్ నాయక్ దళిత రత్న అవార్డు లభించింది మేరకు శుక్రవారం మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా గణేష్ నాయక్ అవార్డు ప్రధానం చేసినట్లు గణేష్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కే ప్రసాద్, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బైరు అనిల్ తదితరులు ఉన్నారు.

## మనం మారితే లోకం మారుతుంది!!




బాధ్యతతో బ్రతుకుదాం భావితరాలకు స్ఫూర్తినిద్దాం
భూమిని రక్షిద్దాం భూ తాపాన్ని తగ్గిద్దాం
చెట్లను పెంచుదాం కాలుష్యాన్ని తగ్గిద్దాం
నీటిని పొదుపు చేద్దాం జీవనాన్ని నిలుపుదాం!!
ప్లాస్టిక్ వాడకం మాని ప్రకృతిని కాపాడుదాం
పక్షులకు గూడు కట్టి ప్రేమను పంచుదాం
మట్టిని కలుషితం చేయక మంచి పంట పండిద్దాం
మనిషిగా మారి మమతను చాటుదాం!!
వ్యర్థాలను తగ్గించి వసుధను అలంకరిద్దాం
విద్యుత్తును ఆదా చేసి వెలుగును మిగులుద్దాం
సైకిల్ పై సాగి స్వచ్ఛమైన గాలి పీలుద్దాం
స్వార్థాన్ని వదిలి సామూహికంగా ఆలోచిద్దాం!!
నేల తల్లి రుణం తీర్చే నేటి బిడ్డలమవుదాం
నీలాకాశం చల్లదనం నిలిపే దీపాలమవుదాం
రేపటి పిల్లల నవ్వుల కోసం ఈరోజు నడుద్దాం
రక్షణగా మన భూమికి మనమే నిలుద్దాం!!
చిన్న మార్పుతో చరిత్రను రాసే చేతులమవుదాం
చిరునవ్వుతో ఈ ధరణిని చేరదీసి బ్రతుకుదాం
మనం మారితే లోకం మారుతుంది, రండి కలిసి నడుద్దాం!!

**గడ్డం సంతోష్ రాజ్**
గోదావరిఖని, 9849555485

## 80 నాటకాలు రాసిన టి.తాతారావు యాదవ్ కు సత్కారం



**గుంటూరు, ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రముఖ నాటక రచయిత టీ తాతారావు యాదవ్ కి జీ. కొత్తపల్లి యాదవ గ్రామ పెద్దలతో రచయితగా 28 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చిరు సత్కారం మేమేంటో అంద చేయడం జరిగింది. పత్తిపాడు నియోజకవర్గం, కాకినాడ జిల్లా శంఖవరం మండలం జి కొత్తపల్లి గ్రామం నల్ల కొండమ్మ తల్లి ఆటో యూనియన్ వారిచే టైగర్ సింహ్ సాంఘిక నాటకం ప్రదర్శన జరిగింది ఈ నాటకానికి రచయిత టీ తాతారావు యాదవ్ ముఖ్యఅతిథిగా రావడం జరిగింది. ఇప్పటివరకు 80 నాటకాలు రాయటం జరిగింది. రచయితగా 28 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జి కొత్తపల్లి యాదవ బ్రదర్స్ గ్రామ పెద్దలు సన్మానించడం జరిగింది. గుంటూరు జిల్లా నుండి జి కొత్తపల్లి రావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని నల్ల కొండమ్మ తల్లి ఆటో యూనియన్ యాదవ బ్రదర్స్ సంతోషం వ్యక్తం చేశారు. సాంఘిక నాటక రచయితగా పేరు ప్రతిష్టలు పొందుతున్న యువ రచయితకి గ్రామ పెద్దలు అభినందనలు తెలిపి, చిరు సత్కారం చేసి మేమెంటో, సాల్వాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈగలరవి, వెంకటరమణ నాగిని, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా పరిశుభ్రత ప్రచారం చేయాలి!!

**● చెత్త వేస్తే రూ.500 జరిమానా ● నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరం ● మేయర్ మహంకాళి స్వామి**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 27 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి సోమవారం 48వ డివిజన్‌లోని చంద్రబాబు కాలనీ, కెసిఆర్ కాలనీ, సాయి నగర్ ప్రాంతాలను స్థానిక కార్పోరేటర్ రేణికుంట్ల నిర్మలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భనలో ఆయన మహిళా సంఘాల సభ్యులు, మెప్మా ఆర్‌పిలు ప్రతి ఇంటా పరిశుభ్రతపై ప్రచారం చేయాలని కోరారు. నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్, నగర పాలక సంస్థ చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని సూచించారు. కాలువల్లో, రోడ్లపై చెత్త వేయడం వలన అనారోగ్యకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని హెచ్చరించారు. చెత్త బహిరంగ ప్రదేశాల్లో వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని, అదే పునరావృతమైతే మున్సిపల్ సేవలు నిలిపివేస్తామని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రంగా ఉంచాలని, పొదలు పెరిగినా లేదా నీరు నిలిచినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా అడ్డంగా పెరిగిన చెట్లు, పొదలను జెసిబి తో తొలగించి శుభ్రం చేశారు. స్థల ఆక్రమణలను తొలగించి, రోడ్లను విశాలంగా ఉంచి అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలు సులభంగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఇంటి బయట దారికి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికివేసి తరలించడానికి మేయర్ స్వయంగా సహాయపడ్డారు. అధికారులను, సిబ్బందిని కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేశారు.

## ప్రాణాలను మింగుతున్న ప్రమాదకర రోడ్లు!!

**● భద్రత చర్యలు ఎక్కడ? ● సైన్ బోర్డ్స్ లేక ప్రాణాలు పోతున్నాయి ● ప్రగతినగర్ రహదారులు రక్తపు గీతలు ● బిజేపీ నాయకురాలు సోమారపు లావణ్య**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 27 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రగతినగర్ కాలనీ రక్తపు రహదారులు వలన ప్రతిరోజూ ప్రాణాలు పోతున్నాయి, ప్రమాదాలు పెరుగుతున్నాయి అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు బీజేపీ నాయకురాలు సోమారపు లావణ్య. ఈ మేరకు సోమవారం ప్రగతి నగర్ కాలనీ వాసులతో కలిసి రోడ్డుపై తమ నిరసన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు, లైట్స్ లేకపోవడం వల్ల రాత్రివేళ రోడ్లు మరింత ప్రమాదకరంగా మారాయి అని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో గెలిచాక ప్రజల సమస్యలను విస్మరిస్తున్నారని వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి, సైన్ బోర్డ్స్ పెట్టాలి, ట్రాఫిక్ బ్యారియర్స్ అమర్చాలి, జీబ్రా క్రాసింగ్‌లు గుర్తించాలి. ఇవి లేకపోతే మరిన్ని ప్రాణాలు పోతాయని వారు హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను కోరారు. రోడ్లపై భద్రతా చర్యలు లేకపోవడం వల్ల ప్రగతినగర్ వాసులు నిరంతరం ప్రమాదాల బారిన పడుతున్నారు అని తెలిపారు. రహదారులు రక్తపు గీతలుగా మారకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి. అధికారులు స్పందించకపోతే ప్రజా ఉద్యమం తప్పదని నాయకులు, వాసులు హెచ్చరిస్తున్నారు.

## ఎండాకాలంలో ట్రాఫిక్ సిబ్బందికి రక్షణ చర్యలు!!

**● చలువ కళ్లద్దాల పంపిణీ కార్యక్రమం ● విధుల్లో ఆరోగ్యం ముఖ్యం ● రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 27 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్వయంగా చలువ కళ్లద్దాలను అందజేశారు. ఎండాకాలంలో రోడ్లపై గంటల తరబడి విధులు నిర్వహించే సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత ముఖ్యం అని ఆయన స్పష్టం చేశారు. సిబ్బంది పనితీరును వ్యక్తిగతంగా అడిగి తెలుసుకుంటూ, ఎండ వేడిమి ప్రభావం నుండి రక్షణ పొందేందుకు తరచుగా నీళ్లు త్రాగాలని సూచించారు. విధుల్లో గానీ, వ్యక్తిగతంగా గానీ ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రోత్సహించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కమిషనర్ మాటల్లో విధుల్లో ఆరోగ్యం ప్రాధాన్యతను గుర్తుచేస్తూ, సిబ్బంది సంక్షేమం కోసం తీసుకున్న ఈ చర్య ఒక స్ఫూర్తిదాయక ఉదాహరణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, ఆర్.ఐ. రమేష్, ఎస్.ఐ. హరిశేఖర్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామచంద్రరావు జన్మదినం సేవా కార్యక్రమం!!

**● తబిత ఆశ్రమంలో బిజెపి శ్రేణుల సేవా స్ఫూర్తి ● చిన్నారులతో కేక్ కటింగ్, ఆనంద క్షణాలు ● ఆశ్రమానికి బియ్యం, నిత్యావసర సరుకుల అందజేత ● సమాజ సేవతో జన్మదిన వేడుకకు ప్రత్యేకత ● కందుల సంధ్యారాణి సమన్వయంతో సేవా కార్యక్రమం**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 27 (వార్తాప్రభ ప్రతినిధి)** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు జన్మదినం సందర్భంగా తబిత ఆశ్రమంలో సేవా కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా జరిగింది. బిజెపి శ్రేణులు కలిసి ఆశ్రమంలోని చిన్నారులతో కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఆశ్రమానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసి మానవతా విలువలను ప్రతిబింబించారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, రాజకీయానికి మించి సమాజ సేవే నిజమైన విలువ అని అన్నారు. రామచంద్రరావు జన్మదినాన్ని ఆశ్రమంలోని చిన్నారులతో కలిసి జరుపుకోవడం ద్వారా మానవతా భావాన్ని ప్రతిఫలింపజేశాం అని తెలిపారు. పిల్లల నవ్వులు, వారి ఆనందం మనందరికీ స్ఫూర్తి. బియ్యం, నిత్యావసర సరుకులు అందించడం ద్వారా ఆశ్రమానికి కొంత సహాయం చేసినందుకు సంతోషంగా ఉంది. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మార్పు తీసుకువస్తాయి అని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో చిన్నారుల నవ్వులు, ఆశ్రమంలో ప్రతిధ్వనించిన ఆనంద క్షణాలు, పార్టీ కార్యకర్తల సమిష్టి సహకారం కలసి ఒక ప్రత్యేక దృశ్యాన్ని సృష్టించాయి. రాజకీయానికి మించి సమాజ సేవను ప్రాధాన్యంగా చూపిన ఈ కార్యక్రమం మార్గదర్శకంగా నిలిచింది. ఈ కార్యక్రమం, ఆశ్రమంలోని పిల్లలకు ఒక మధురమైన జ్ఞాపకంగా నిలిచింది.

## ఆహార భద్రతలో వెటర్నరీల పాత్ర వెలకట్టలేనివి

**ప్రపంచ వెటర్నరీ దినోత్సవంలో వక్తలు**



**హైదరాబాద్ : ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజారోగ్యం, ఆహార భద్రతను కాపాడడంలో వెటర్నరీ వైద్యుల సేవలు వెలకట్టలేనివని ప్రముఖులు కొనియాడారు. రాజేంద్రనగర్‌లోని కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ లో పౌల్ట్రీ సైన్స్ విభాగం, ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్, పౌల్ట్రీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రపంచ వెటర్నరీ దినోత్సవం 2026' వేడుకలు ఘనంగా జరిగాయి. వెటర్నరీలు : ఆహారం మరియు ఆరోగ్య రక్షకులు అనే నినాదంతో నిర్వహించిన ఈ సదస్సులో వైస్ ఛాన్సలర్ డా. ఎం. జ్ఞాన ప్రకాశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ ఆరోగ్య సంరక్షణలో పశువైద్యుల పాత్రను చెప్పారు. గౌరవ అతిథిగా హాజరైన డా. ఎం. ఉదయ కుమార్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు పోషకాహార భద్రత కల్పించడంలో ఈ రంగం ముందంజలో ఉందన్నారు.

**పరిశ్రమ -- విద్యాసంస్థల మధ్య సమన్వయం అవసరం** పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బాయాస్ ప్రత్యేక అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ, విద్యాసంస్థలు, పౌల్ట్రీ పరిశ్రమల మధ్య బంధం మరింత బలపడాలని ఆకాంక్షించారు. పౌల్ట్రీ ఉత్పత్తులపై సమాజంలో ఉన్న పలు అపోహలను శాస్త్రీయంగా తొలగించాల్సిన బాధ్యత వెటర్నరీ విద్యార్థులపై ఉందన్నారు.

**విద్యార్థుల్లో స్ఫూర్తి:**ఈ సందర్భంగా "పౌల్ట్రీ ఉత్పత్తులు, జీవనశైలి వ్యాధులు: అపోహలు – వాస్తవాలు" అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన సాంకేతిక సెషన్‌లో డా. ముజీబ్ అతర్, డా. శ్రీనివాస్ రామరాజు వంటి నిపుణులు పౌల్ట్రీ రంగంలో ఉన్న అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వివరించారు. డా. ఆర్.ఎం.వి. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు,పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వేడుక పౌల్ట్రీ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకునే యువ నిపుణులకు దిశానిర్దేశం చేసే వేదికగా నిలిచింది.

# హైదరాబాద్

## రాఘవేంద్ర కాలనీలో ఘనంగా జెండా ఆవిష్కరణ: పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



**జీడిమెట్ల, ఏప్రిల్ 27, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు.

**ఉత్సాహంగా వేడుకలు** కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మరియు పార్టీ కార్యకర్తల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుంట సిద్ధిరాములు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, కాలనీ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో తమ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## రామగుండంలో ఫీజు పోరుబాట!!

**విద్యార్థుల భవిష్యత్తు కోసం చందర్ కదలిక**
**ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధనకు ఉద్యమ పిలుపు**
**పేద, మధ్యతరగతి విద్యార్థులకు కొత్త ఆశాకిరణం**




**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 27 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నియోజకవర్గంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కొత్త పోరాటానికి శ్రీకారం చుట్టారు. సోమవారం ఆయన 'ఫీజు పోరుబాట' పోస్టర్‌ను ఆవిష్కరించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్వి విద్యార్థి నాయకులు, పార్టీ సీనియర్ నేతలు, యువజన విభాగం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు. వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు బకాయిలు విడుదల కాకపోవడంతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఈ సందర్భంగా చందర్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు అండగా నిలిచామని, ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఆయన హితవు పలికారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోరుబాటను విస్తరించనున్నట్లు బిఆర్ఎస్వి నాయకులు ప్రకటించారు. ప్రతి కళాశాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులను చైతన్యపరుస్తామని శ్రేణులు తెలిపారు. విద్యార్థుల సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆగదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమం విద్యార్థి లోకంలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధనకు ఇది తొలి అడుగు అని వారు పేర్కొన్నారు.

## సమాజంలో ఐక్యత, సేవాభావం పెంపొందించుకోవాలి - ఎమ్మెల్యే గాంధీ



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 27 (వార్తాప్రభ):** మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ నగర్ కాలనీలో గల బొమ్మరిల్లు బంక్వెట్ హాల్‌లో శ్రీ వాసవి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, సేవా భావం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,కోనేరు ప్రసాద్ పాల్గొన్నారు. సంఘ సభ్యులు అప్పారావు,శ్రీనాథ్,కిషోర్, వెంకన్న తదితరులు హాజరయ్యారు.

# ఎడిటోరియల్

## బంకుల్లో నో స్టాక్.. గుట్టు విప్పిన డీలర్లు

అనవసరమైన ఆందోళన వద్దు. పెట్రోల్.. డీజిల్ కు అస్సలు కొరత లేదు. పుకార్లను నమ్మొద్దు. తప్పుడు ప్రచారాలు చేయొద్దు. తగినన్ని నిల్వలు ఉన్నాయి. ఎలాంటి దిగులు వద్దు.. ఇరాన్ యుద్ధ నేపథ్యంలో పెట్రోల్.. డీజిల్ కు ఎలాంటి సమస్యా లేదని.. ఇబ్బందులు పడే పరిస్థితి లేదని పౌరసరఫరాల శాఖ పదే పదే చెబుతోంది. ఇందుకు భిన్నంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు చోట్ల బంకుల్లో పెట్రోల్.. డీజిల్ లేదంటూ నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. శనివారంకొంత కనిపించినా.. ఆదివారం నాటికి ఈ సమస్య మరింత పెరిగినట్లుగా చెబుతున్నారు. పలు చోట్ల వాహనదారులు బారులు తీరుతున్న పరిస్థితి, కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పోలీసుల భద్రతమధ్య అమ్మకాలు చేపట్టాల్సిన పరిస్థితి. ఏపీలోనూ ఇలాంటి పరిస్థితే పలుచోట్ల ఉందని చెబుతున్నారు. ప్రభుత్వ వర్గాలు చెప్పే మాటల్ని కాసేపు పక్కన పెట్టి.. గ్రౌండ్ రియాల్టీని చూస్తే మాత్రం పెట్రోల్.. డీజిల్ కొరత కనిపిస్తోంది.అయితే.. లోపం ఎక్కడ ఉంది? అన్నది మరో ప్రశ్న. ఇంధనం కొరత తీవ్రంగా ఉందన్న మాట బంకుల యజమానుల నుంచి వినిపిస్తోంది. వారు అందిస్తున్న సమాచారాన్ని చూస్తే.. ఆయిల్ కంపెనీల నుంచి ఇంధనం సకాలంలో సరఫరా కావటం లేదని చెబుతున్నారు. అంతేకాదు.. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటివరకు ఈ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. ప్రభుత్వం ధరలు పెంచటం లేదన్న మాట బలంగా వినిపిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ఓటింగ్ ముగిసిన వెంటనే పెట్రోల్.. డీజిల్ ధరలు పెరగటం ఖాయమని.. ఈ కారణంగానే ఆయిల్ కంపెనీలు సరఫరా తగ్గించి ఉండొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలంగాణ వ్యాప్తంగా దగ్గర దగ్గరగా నాలుగు వేలకు పైగా పెట్రోల్ బంకులు నడుస్తున్నాయి. మారిన పరిస్థితులకు అనుగుణంగా బంకు యజమానులు ముందస్తుగా డబ్బులు చెల్లించటం లేదని.. ఈ కారణంగానే సరఫరాల్లో తేడా వచ్చిందన్న మాట వినిపించింది. అయితే..తాజాగా బంకుల యజమానులు మాత్రం.. ముందస్తుగా డబ్బులు కట్టినా ఇంధన ట్యాంకర్లు రావటం లేదన్న మాటను చెబుతున్నారు. అమెరికా –ఇరాన్ యుద్ధానికి ముందు వరకు పెట్రోల్ కానీ డీజిల్ కానీ చమురు సంస్థలకు స్టాక్ అందిన సాయంత్రం కానీ.. తర్వాతి రోజు ఉదయం కానీ డబ్బులు చెల్లించే వెసులుబాటు కల్పించారు. అయితే.. కొద్దిరోజులుగా మాత్రం డబ్బులు పంపితేనే ట్యాంకర్లు బంకులకు వచ్చేవి. ఇప్పుడు డబ్బులు ముందస్తుగా చెల్లించినా రెండు.. మూడు రోజులకు కానీ ట్యాంకర్లు రావటం లేదని పెట్రోల్ బంకు యజమానులు స్పష్టం చేస్తున్నారు. పౌర సరఫరా శాఖ అధికారుల చెబుతున్న మాటల్లో నిజం లేదనే చెప్పాలి. గడిచిన రెండు.. మూడు రోజుల వ్యవధిలో తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 25 శాతం బంకులు స్టాక్ లేని కారణంగా బంకుల్ని మూసేశారు. ఏపీలోనూ ఈ తీవ్రత ఎక్కువగానే ఉందంటున్నారు. పశ్చిమాసియాలోని యుద్ధ పరిణామాలతో క్రూడ్ ఆయిల్ ధరలు పెరగటం.. డాలరుతో రూపాయి మారకం విలువ భారీగా పెరిగిపోవటం లాంటి కారణాలతో ఆయిల్ కంపెనీలు తీవ్రంగా నష్టపోతున్నాయి.రాజకీయకారణాలతో.. ధరల్ని అలానే ఉంచేశారు. ఆసియాలోని దేశాల్లో చూస్తే.. యుద్ధం తర్వాత కనిష్ఠంగా 25 నుంచి 30 శాతం వరకు ధరలు ఆయా దేశాల్లో పెరిగిన పరిస్థితి. నష్ట భారాన్ని తగ్గించుకోవటానికి ఆయిల్ కంపెనీలు సరఫరా తగ్గించినట్లుగా చెబుతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో అక్కడక్కడా స్టాక్ లేని కారణంగా బంకులు మూసి వేయగా.. హైదరాబాద్ లో మాత్రం ఒకట్రెండు చోట్ల మాత్రమే అలాంటి పరిస్జితి ఉందంటున్నారు. మొత్తంగా చూస్తే.. నోస్టాక్ బోర్డులు పెట్టే ఆయిల్ బంకుల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నాయి. దీనిపై తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన ప్రకటన చేస్తే సరి. లేదంటే ప్యానిక్ బయ్యింగ్ మొదలవుతుంది. అప్పుడు పరిస్థితులు మరింతగా దిగజారతాయనన‌ది మర్చిపోకూడదు.

## ఘనంగా బొడ్డు నోబుల్ కుమారుడు బొడ్డు జీవన్ వివాహం

**పాల్గొన్న ఎమ్మెల్యే కామినేని, శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు**



**ముదినేపల్లి ఏప్రిల్ 27 (వార్తా ప్రభ)** కైకలూరు మండలం కైకలూరు సిఎన్ఆర్ గార్డెన్స్‌లో బొడ్డు నోబుల్ కుమారుడు బొడ్డు జీవన్ వివాహ రిసెప్షన్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు డా. కామినేని శ్రీనివాస్, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో వీరమల్లు నరసింహారావు, ఎన్డీఏ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడింది.

## త్యాగమూర్తి తల్లి

అమ్మ ఒడిలో హాయిగా
మల్లెపూల పాన్పుగా
ఉంటుంది ఖచ్చితంగా
అందరికి విదితమేగా
అమ్మ మనసు చల్లగా
మంచులాగ తెల్లగా
ఉంటుంది పుత్తడిలా
వజ్రంలా గొప్పగా
అమ్మ ఇంట దీపంలా
ప్రేమకు ప్రతిరూపంలా
ఉంటుంది స్వర్గంగా
దేదీప్యామానంగా
అమ్మ అనురాగ దేవత
మరచిపోదు తన బాధ్యత




నిశ్చలమైన మనసుతో
గౌరవించు అంచేత

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

## రాష్ట్రంలో పెట్రోలియం ఉత్పత్తుల కొరత నివారణకు చర్యలు తీసుకోవాలి

**ప్రభుత్వానికి సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ విజ్ఞప్తి**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 27: (వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ తదితర పెట్రోలియం ఉత్పత్తుల కొరత నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ విజ్ఞప్తి చేశారు. పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ కొరకు వాహనదారులు, రైతులు పలు అవస్థలు పడుతున్నారని, పెట్రోల్ స్టేషన్ ల వద్ద నో స్టాక్ బోర్డులు పెడుతుండడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. పెట్రోలియం ఉత్పత్తుల పంపిణీ సజావుగా జరిగేలా తక్షణ చర్యలు అవసరమని అన్నారు. వంటగ్యాస్ కు సంబంధించి విపరీతంగా బ్లాక్ మార్కెటింగ్ జరుగుతోందని, బ్లాక్ మార్కెట్ ను అరికట్టేందుకు తక్షణ చర్యలు అవసరమని పేర్కొన్నారు. గృహ అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ బ్లాక్ మార్కెట్లో 3000 రూపాయలు వరకు అమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే దేశంలో ప్రస్తుతం గ్యాస్, పెట్రోలు, డీజిల్ వంటి పెట్రోలియం ఉత్పత్తుల కొరత ఏర్పడుతోందనీ ,యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ కొరత మరింత పెరిగే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పెట్రోలియం ఉత్పత్తులు ఉత్పత్తి చేసే దేశాల నుండి అవసరమైన మోతాదులో దిగుమతులు పెంచి, దేశంలో ఉన్న కొరతను నివారించాలనీ ఆకుల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం కూడా అత్యంత ముఖ్యమైనదన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సరఫరాను స్థిరంగా ఉంచేందుకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత వెనుక కూటమి నేతల కుట్ర

**మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు**




**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత మూడు రోజులుగా నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తీవ్రంగా మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ అసమర్థత వల్లే ప్రజలు బంకుల వద్ద కిలోమీటర్ల మేర క్యూ కట్టాల్సి వస్తోందని ఆయన విమర్శించారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కృత్రిమ కొరత – బ్లాక్ మార్కెట్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 4,510 పెట్రోల్ బంకుల్లో సుమారు 70 శాతం బంకులు 'నో స్టాక్' బోర్డులు పెట్టడం వెనుక కూటమి నేతల కుట్ర ఉందని వెలంపల్లి ఆరోపించారు. ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయనే ఆశతో, డీలర్లతో కుమ్మక్కై నిల్వలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని మండిపడ్డారు.కేంద్రం నుంచి సరఫరాలో లోటు లేదు: వైఎస్సార్సీపీ ఎంపీలు కేంద్ర మంత్రులను సంప్రదించగా, రాష్ట్రానికి ఇంధన సరఫరాలో ఎలాంటి లోటు లేదని స్పష్టం చేశారని.. మరి రాష్ట్రంలో కొరత ఎందుకు ఏర్పడుతోందని వెలంపల్లి ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. ?చంద్రబాబు, లోకేష్ మౌనంపై విమర్శలు వెల్లంపల్లి ధ్వజమెత్తారు. నిత్యం ప్రతి చిన్న విషయానికి స్పందించే చంద్రబాబు నాయుడు, సకల శాఖా మంత్రి లోకేష్‌లు రాష్ట్ర ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఏఐ (ఏ ఐ) సాంకేతికత గురించి గొప్పలు చెప్పుకునే లోకేష్‌కు, పెట్రోల్ కొరత ఎందుకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు.ప్రయాణికులు, రైతుల ఇబ్బందులు గూర్చి ఆయన మాట్లాడుతూ తిరుపతి వెళ్లే భక్తులు, హైవేలపై ప్రయాణించే వారు, వ్యవసాయ పనుల కోసం డీజిల్ అవసరమైన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.?కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి, పెట్రోల్ బంకుల వద్ద కృత్రిమ కొరతను నివారించాలని, బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టి ప్రజలకు ఇంధనం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వెలంపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## నగర పరిశుభ్రతకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్







**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగర పరిశుభ్రతకు స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారని చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కి అర్జునరావు అన్నారు. సోమవారం ఉదయం ఏలూరు రోడ్ రామవరప్పాడు నుండి పాత బస్టాండ్ వరకు శానిటేషన్ డ్రైవ్ ని నిర్వహించారు ప్రజారోగ్యం సిబ్బంది. 160 ప్రజారోగ్యం సిబ్బందితో ఈ డ్రైవ్ ని నిర్వహించారు.ఈ శానిటేషన్ డ్రైవ్ లో రామవరప్పాడు రింగ్ వద్ద నుండి పాత బస్టాండ్ వరకు ఏలూరు రోడ్డు మొత్తం ఎక్కడ పారిశుధ్య నిర్వహణలోపం లేకుండా రోడ్లను ఓడవటం, డివైడర్ల వద్ద మట్టి లేకుండా చూసుకోవటం, సైడ్ కాలువల్లో పూడికలును తొలగించటం, తొలగించిన వ్యర్ధాలను బాబ్కాట్లతో తీసేయటం, ప్రధాన రహదారులలో స్లీపింగ్ మెషిన్ ఉపయోగించడం ద్వారా ఈ శానిటేషన్ డ్రైవ్ ని నిర్వహించారు.దీనిలో భాగంగా శనివారం బందర్ రోడ్డు, సోమవారం రామరుప్పాడు నుంచి పాత బస్టాండ్ వరకు, మంగళవారం బి ఆర్ టి ఎస్ రోడ్డు మరియు బుధవారం రామవరప్పాడు ఇన్నోటల్ హోటల్ నుంచి గుణదల వరకు ఉన్న బ్రిడ్జ్ ఇరువైపులా శానిటేషన్ నిర్వహిస్తున్నట్లు చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ తెలిపారు. ముఖ్యంగా ఈ శానిటేషన్ డ్రైవ్ లో 160 మంది శానిటేషన్ వర్కర్లని ఉపయోగించి, డివైడర్ క్లీనింగ్, స్వీపింగ్, బస్ స్టాప్ క్లీనింగ్, ట్రై బీన్స్ క్లీన్ చేసి వాటికి స్టిక్కర్స్ అంటించడం, డ్రైన్ క్లీనింగ్ లు చేస్తున్నారని అన్నారు. దీనిలో భాగంగా ఎనిమిది బాప్ కాట్లు, ఎనిమిది ట్రాక్టర్స్, జెట్ మిషన్స్ మూడు, స్వీపింగ్ మిషన్స్ రెండు ఉపయోగిస్తున్నారని, ఈ వర్క్స్ ని పర్యవేక్షించడానికి మెడికల్ హెల్త్ ఆఫీసర్లు అన్నపూర్ణ , గోపాల్ నాయక్, ముగ్గురు శానిటరీ సూపర్వైజర్లు సోమరాజు, రమేష్, సలీం, మరియు తొమ్మిది మంది శానిటరీ ఇన్స్పెక్టర్లు ఈ డ్రైవ్ లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

## హేయర్ ఎఫ్ 11 వాషింగ్ మెషీన్ ఆవిష్కరణ




**కడప:– ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రముఖ మేజర్ అప్లయన్స్ బ్రాండ్ అయిన హేయర్ అప్లయన్సెస్ ఇండియా, తన కొత్త హేయర్ ఎఫ్ 11 వాషింగ్ మెషీన్ సిరీస్ లాంచ్‌తో లాండ్రీ ఇన్నోవేషన్‌ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా హేయర్ అప్లయన్సెస్ ఇండియా ఎన్.ఎస్. సతీష్ మాట్లాడుతూ బట్టల దుర్వాసన, డిటర్జెంట్ వృధా మరియు సంక్లిష్టమైన నియంత్రణలవంటి రోజువారీ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి రూపొందించబడిన హేయర్ ఎఫ్ 11 భారతదేశంలో ఏకైక అల్ట్రా ఫ్రెష్ ఎయిర్ టెక్నాలజీ మరియు ఏఐ టచ్ పానెల్‌తో ఆధునిక భారతీయ గృహాలలో లాండ్రీకి అసాధారణమైన తాజాదనం, పరిశుభ్రత మరియు సంరక్షణను అందిస్తుందని చెప్పారు. హేయర్ ఎఫ్ 11 వాషింగ్ మెషీన్ భారతదేశంలో ఏకైక అల్ట్రా ఎయిర్ ఫ్రెష్ టెక్నాలజీ ద్వారా బట్టలను గంటల పాటూ వరకు సూపర్ ఫ్రెష్‌గా ఉంచుతుందన్నారు. వాష్ తర్వాత బట్టలు లోపల వదిలినా దుర్వాసన రాకుండా నిరోధిస్తుందని, దాని స్టైలిష్ డిజైన్‌తో పాటు ఫుల్ ఏఐ కలర్ టచ్ పానెల్ ఉంది, ఇందులో పెద్ద ఐకాన్లు మరియు చీరలు, జీన్స్ మరియు కాటన్ వంటి బట్టలకు అంకితమైన ప్రోగ్రామ్‌లు ఉన్నాయి, ఇవి రోజువారీ వినియోగాన్ని సులభతరం చేస్తాయన్నారు. ఈ వాషింగ్ మెషీన్‌లో ఎసెన్స్ వాష్ టెక్నాలజీ ఉంది, ఇది లోడ్‌కు అనుగుణంగా స్వయంచాలకంగా డిటర్జెంట్ వినియోగాన్ని సర్దుబాటు చేసి వృధాను తగ్గిస్తుందన్నారు. ఇనిస్టెంట్ డిసాల్వ్ ప్రీమిక్స్ టెక్నాలజీ వేగంగా మరియు మరింత సమర్థవంతంగా డిటర్జెంట్ కరగడానికి ప్రీమిక్స్ మైక్రోబబుల్ సొల్యూషన్ తయారు చేస్తుందన్నారు. 3 డీ పవర్ స్ప్రేయింగ్ ద్వారా ఈ మైక్రోబబుల్ సొల్యూషన్ నేరుగా బట్టలపై స్ప్రే చేయబడుతుంది, దీనివల్ల లోతైన మరియు పూర్తి శుభ్రత లభిస్తుందని చెప్పారు. ఎఫ్ 11 లాంచ్‌తో, ఆధునిక భారతీయ గృహాలు ఎదుర్కొనే నిజమైన, రోజువారీ సవాళ్లను పరిష్కరించడమే మా లక్ష్యం అని, నేడు లాండ్రీ కేవలం ఒక సాధారణ పని మాత్రమే కాదు; అది పరిశుభ్రత, సౌలభ్యం మరియు సాంకేతికత నిశ్శబ్దంగా దాని గురించి శ్రద్ధ వహిస్తుందనే భరోసాతో ముడిపడి ఉందన్నారు. కొత్త హేయర్ ఎఫ్ 11 యొక్క ప్రతి ఫీచర్ అనుభవాన్ని సులభతరం చేయడానికి మరియు అధునాతన సాంకేతికతను అందరికీ సహజంగా మరియు అందుబాటులో ఉండేలా చేయడానికి శ్రద్ధగా రూపొందించబడిందని తెలిపారు.

## జాక్విన్ యోధా పుట్టినరోజు సందర్భంగా ప్రేమవిందు



**రెడ్డిగూడెం,ఏప్రిల్27(వార్తాప్రభ ప్రతినిధి ):**రెడ్డిగూడెం మండల కేంద్రంలో దళితవాడ గల ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ వృద్ధుల డేకేర్ సెంటర్ నందు సోమవారం నాడు నిరుపేదలైన వారికి ప్రేమవిందు జరిగింది. డాక్టర్ జి శశివర్మ – రత్న షైనీ దంపతుల కుమారుడు జాక్విన్ యోధా 6 వ పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ ప్రేమవిందు కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు చాట్ల విజయకుమార్ పాల్గొని కేక్ కట్ చేసి జాక్విన్ యోధా కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సిహెచ్ హన్న, ట్రజరర్ సునీల్, బండారు సంగీతరావు, నిర్మల, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## చింతలపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం






**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండు వేసవిలో ప్రజల సౌకర్యార్థం ప్రముఖ వ్యాపారవేత్త చింతలపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో 47వ డివిజన్ లోని గుజ్జారి ఎల్లారావు మార్కెట్ ఆంజనేయస్వామి గుడి వద్ద మల్లపరెడ్డి అప్పారావు ఫ్రెండ్స్ సర్కిల్ నేతృత్వంలో చలివేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతలపూడి సత్యనారాయణ మాట్లాడుతూ తన తల్లి స్వర్గీయ చింతలపూడి కనకదుర్గమ్మ జ్ఞాపకార్థం చలివేంద్రమును ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ వేసవి కాలంలో ఎండలు విపరీతంగా ఉన్నాయని శరీరం డీహైడ్రేషన్ కు గురికాకుండా ప్రతి ఒక్కరు తగినంత మంచినీరు త్రాగాలని కోరారు. ప్రజానీకం సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ను ప్రయాణికులు, స్థానిక ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. తొలి రోజున వేలాది మందికి మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దల సంగీత, బంటుపిల్లి రాంబాబు, పొట్నూరి శంకర్, లంకలపల్లి రమేష్, చెవుల శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడుకి ఘన నివాళులు




**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద రాజా వాసి రెడ్డి వెంకటాద్రి నాయుడుకి ఘన నివాళులర్పించారు. కమిషనర్ ధ్యానచంద్ర. సోమవారం ఉదయం రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చిత్రపటానికి పూలను మాలలు అర్పించి సిబ్బందితో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యాన చంద్ర మాట్లాడుతూ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు, అమరావతి ప్రాంత అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన గొప్ప పరిపాలకుడు మరియు దాతృత్వ గుణం కలిగిన నాయకుడని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. నేటి తరానికి రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జీవితం స్ఫూర్తిదాయకమని, ప్రజాసేవలో నిబద్ధతతో పని చేయాల్సిన అవసరాన్ని రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చూపించిన మార్గం ద్వారా గ్రహించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఏ రవీంద్రరావు, డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ కే. సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ (ఇంచార్జ్) సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, సూపర్డెంట్ ఇంజనీర్ (వర్క్స్) వి. చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాల కృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డి.హరీష్, బయాలజిస్ట్ వి.కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## మే 1 నుంచి రోబోటిక్స్ లో ఉచిత శిక్షణ

**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 27:(వార్తా ప్రభ ప్రతినిధి)** కళాశాల, పాఠశాల విద్యార్థులకు అధునాతన రోబోటిక్స్ సాంకేతిక పరిజ్ఞానం గురించి అవగాహన, ప్రయోగ పూర్వక శిక్షణ అందించేందుకు తమ కళాశాల సెంటర్ ఫర్ రోబోటిక్స్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ కేంద్ర తరఫున ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కె.బి.ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 వ తేదీ నుంచి ఉదయం ఈ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆబ్జెక్ట్ ప్రింటింగ్, రోబో తయారీ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం గం.9 నుంచి గం.12 వరకు; మధ్యాహ్నం గం.2 నుంచి గం.5 ల వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఈ తరగతులు పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాల కార్యాలయంలో నేరుగా లేదా 94915 43772 నంబరులో సంప్రదించాలని కోరారు

## పేదప్రజలచదువుకునే లైబ్రరీని పునఃప్రారంభం చేయాలి

**ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్. ఎస్.ఇలక్కియా. నిమర్యాదపూర్వకంగా కలిసిన వినతి పత్రం సమర్పించిన.రాష్ట్ర వైఎస్ఆర్సిపి మైనారిటీ కార్యదర్శి. బాజీ బాబా**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడపశ్చిమ నియోజకవర్గం 55వ డివిజన్ వించిపేట నైజాంగేట్.సెంటర్లోగల సానిటరీ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ప్రక్కన గత దశాబ్దాల నుండి డివిజన్లో పేద మధ్య తరగతి పిల్లలకు పెద్దలకు లైబ్రరీ వుండేది. ఆ .లైబ్రరీరెండు సంవత్సరాల నుండి లైబ్రరీని మూసేసి ఆ స్థానంలో జనన మరణ కార్యాలయము ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాడు నేడువేసవి సెలవులలో పిల్లలకు పెద్దలకు కంప్యూటర్ శిక్షణ పుస్తక పఠనము వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణా తరగతులు పెట్టేవారని తెలియజేశారు. కూటమి ప్రభుత్వంవచ్చిన. తర్వాత ఆకార్యక్రమాలకు గాలికి వదిలేశారు.కావునజిల్లాజాయింట్ కలెక్టర్,ఉమ్మడి కృష్ణాజిలా గ్రంథాలయ సంస్థవారు.లైబ్రరీనూతనంగా యధాస్తితంగా నడపవలసిన గా విజ్ఞప్తి చేస్తున్నామని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు షేక్ సుభాని జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఉస్మాన్ తదితరు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యకు నాణ్యమైన పరిష్కారాలను అందించాలి

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వేదికలో వచ్చే ప్రజలకు ఉన్న సమస్యలకు నాణ్యమైన పరిష్కారాలను అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కారం సోమవారం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో కమిషనర్ ధ్యానచంద్ర నిర్వహించారు. జోనల్ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు తెచ్చే సమస్యలకు నాణ్యమైన పరిష్కారాల అందించాలని, ఈవారం వచ్చిన సమస్యలకు శనివారం కల్లా పరిష్కారం అందించేటట్టు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని, ప్రజల సమస్యలకు ప్రాధాన్యమిస్తూ వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ సోమవారం వచ్చిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 23






ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 10, ప్రజారోగ్యం 3 ఇంజనీరింగ్ 3, రెవెన్యూ విభాగం 5, యూసీడి 1, మ్యాపింగ్ 1, ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ డి.చంద్రశేఖర్, ఏ. రవీంద్రరావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) వి.చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, ఆర్ ఎఫ్ ఓ మల్యాద్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి

**పట్టణాలలో 2 సెంట్లు , గ్రామాల్లో 3 సెంట్లు ఎన్నికల హామి అమలు చేయాలి**

**సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ డివి కృష్ణ.**




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 27(వార్తా ప్రభ ప్రతినిధి)** పేదలందరికీ ఇల్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కమిటీ పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నా లో సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ డివి కృష్ణ మద్దతు తెలియజేసి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇళ్ళ స్థలాలు ఎన్నికల హామీల భాగంగా పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, ఇళ్ళు నిర్మించుకోనేందుకు 5 లక్షల ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. మాకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని నిరుపేద మహిళలు ప్రజలు కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గత రెండు సంవత్సరాలుగా ఎన్నిసార్లు సచివాలయాల్లో అప్లికేషన్లు ఇచ్చిన నేటికీ సమాధానం రావట్లేదని అందులో ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ఆందోళన నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని అర్హులైన పేదలందరికీ ఇల్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఓటమి ప్రభుత్వం విఫలమైందని కొండపల్లి మున్సిపాలిటీ లాంటి చోట చాలా చోట్ల త్రాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందని పైపులు పాతవి కావడంతో ఎక్కడికక్కడ లీకేజ్ అవుతున్నాయని నీళ్లు రావట్లేదని , డ్రైనేజీ లేక రోడ్లపైనే మురుగునీరు ఉంటుందని ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో తోపుడుబండ్లు కార్మికులకు ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డు విస్తరణ పేరుతో కార్మికుల పొట్ట కొట్టొద్దని విజ్ఞప్తి చేశారు. అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న అనేకమంది పేదలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం మహేష్ , సీనియర్ నాయకులు ఏ విట్టల్ రావు , ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు ఎల్ పార్వతి , బేబీ సరోజిని, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్ కె బాషా, సిఐటియు మండల నాయకులు ఈ కొండలరావు , కే నారాయణ ఎన్ బాబ్జి , మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ సురేష్ సెక్రెటరీ కృష్ణ కోశాధికారి నవీన్ , తోపుడుబండ్లు వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రెసిడెంట్ జి రమణమ్మ , కార్యదర్శి మల్లేష్ , ఉపాధ్యక్షులు నవీన్ స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# డీజిల్ లేక ఆగిన ట్రావెల్స్ బస్

**ప్రయాణికులు నడిరోడ్డుపై దింపివేసిన బస్సు డ్రైవర్**

**సీఐ సుబ్రహ్మణ్యం చెరువుతో గమ్యస్థానాలకు చేరుకున్న ప్రయాణికులు**







**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 27(వార్తా ప్రభ ప్రతినిధి):** రాష్ట్రంలో డీజిల్ కొరత ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది సోమవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన సంఘటన. హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్న ట్రావెల్ బస్సు ఇబ్రహీంపట్నం చేరుకోగానే డీజిల్ అయిపోయి ఆగిపోయింది. ప్రయాణికులను నడిరోడ్డుపై దించేశాడు బస్సు డ్రైవర్. ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి కనబడకుండా వెళ్లిపోయాడు. విషయం తెలిసిన వెంటనే అప్రమత్తమైన ఇబ్రహీంపట్నం సీఐ సుబ్రహ్మణ్యం ప్రయాణికులు ఇబ్బంది పడకుండా పెట్రోల్ బంక్ వారితో మాట్లాడి 50 లీటర్ ల డీజిల్ కొట్టించి ప్రయాణికులను గమ్యస్థానానికి చేరేలా చేశారు. దీంతో సీఐ సుబ్రహ్మణ్యం కు ప్రయాణికులు ధన్యవాదాలు తెలిపారు

## సుజనా చౌదరి కార్యాలయంలో ఎల్వోసీ అందచేత..




**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి )** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 48 వ డివిజన్ కు చెందిన పల్లె సుధా లక్ష్మీ గర్భాశయ వ్యాధి తో బాధ పడుతోంది.. మెరుగైన వైద్యం కోసం 1,80,000/- రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థిక స్తోమత లేక పోవడంతో ఆమె ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయాన్ని సంప్రదించింది. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆమెకు ఆర్థిక సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కు లేఖ రాసారు. దీనికి సంబంధించిన ఎల్వోసీ నీ సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో రోగి బంధువులకు అంద చేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.. కార్యక్రమంలో 48వ డివిజన్ బిజెపి అధ్యక్షుడు దేవిక హరి ప్రసాద్, 48వ డివిజన్ జనసేన ప్రెసిడెంట్ వవిన నాగరాజుసుజనా మిత్రాలు పాల్గొన్నారు..

# చదలవాడ కోటేశ్వరరావు భూములపై హైకోర్టు కీలక ఆదేశాలు

**వాస్తవాలను వక్రీకరిస్తున్నారంటూ భూ యజమాని చదలవాడ కోటేశ్వరరావు ఆగ్రహం**

విజయవాడ, **ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ముప్పవరపు చౌదరి, లీలా రామకృష్ణ ప్రసాద్ ఆస్తులన్నీ ట్రస్ట్‌కే చెందుతాయని హైకోర్టు ధర్మాసనం తీర్పునిచ్చిందంటూ వస్తున్న వార్తలను భూ యజమాని చదలవాడ కోటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. శనివారం ఒక న్యాయవాది విలేకరుల సమావేశంలో మాట్లాడిన అంశాల్లో ఏమాత్రం నిజం లేదని, కోర్టు ఆదేశాలను కావాలనే వక్రీకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ భూ వివాదంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు (ఉూా 645/2013 కేసులో) 2026 మార్చి 6వ తేదీన స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు .కానూరు, తాడిగడప, యనమలకుదురు రెవెన్యూ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలో ఉన్న సుమారు 5.80 ఎకరాల భూమిని తాము 1997-98 ప్రాంతంలోనే కొనుగోలు చేశామని, గత 29 ఏళ్లుగా అది తమ స్వాధీనంలోనే ఉందని కోటేశ్వరరావు స్పష్టం చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రస్తుతం ఆ భూమి ఎవరి స్వాధీనంలో ఉందో తేల్చాలని హైకోర్టు దిగువ కోర్టును ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యంగా, డాక్టర్ ప్రసాద్ రాసిన వీలునామా చెల్లుబాటు విషయంలో జోక్యం చేసుకోకుండా, కేవలం ఇంప్లీడ్ పిటిషనర్లుగా ఉన్న వ్యక్తుల హక్కులు , వారి ఆధీనంలో ఉన్న భూములపై మాత్రమే విచారణ జరపాలని హైకోర్టు నిర్దేశించిందన్నారు. ఆ భూములపై హక్కులను నిర్ధారించిన తర్వాతే, వీలునామా ప్రకారం పంపిణీకి అందుబాటులో ఉన్న ఆస్తులను తేల్చాలని ట్రయల్ కోర్టుకు సూచించిందనీ తెలిపారు.కోర్టు ఆదేశానుసారం తదుపరి విచారణలో అన్ని ఆధారాలను సమర్పిస్తామని, ఎవరో చెప్పే అసత్య మాటలను నమ్మవద్దని ఈ సందర్భంగా కోటేశ్వరరావు పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే చేతుల మీదుగా కొత్తపల్లిలో చలివేంద్రం ప్రారంభం.

**పాల్గొన్న జనసేన నాయకులు ఏ ఎన్ బాబు.**

**కొత్తపల్లి జనసేన టీంను అభినందించిన ఎమ్మెల్యే కామినేని.**





**ముదినేపల్లి ఏప్రిల్ 27 (వార్తా ప్రభ)** ముదినేపల్లి మండలం కొత్తపల్లి సెంటర్‌లో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని టీం కొత్తపల్లి జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు డా. కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం అత్యంత అవసరమని అన్నారు. ఇలాంటి చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీర్చడమే కాకుండా సేవాభావాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత ముందుండి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. మోటేపల్లి హనుమా యూత్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపడుతోందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. ప్రజలకు అవసరమైన ప్రతి సదుపాయం అందించే దిశగా కృషి కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మెటేపల్లి హనుమాన్, ఏ ఎన్ బాబు, జనసైనికులు సుదాబత్తుల సాయిష్, మారుబోయిన సాయి, పాశం శ్రీను, కఠారి భరత్, పవన్, బోయిన వాసు, దుర్గారావు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వీర మహిళలు పాల్గొన్నారు. చలివేంద్రం ద్వారా ప్రయాణికులు, కూలీలు, రైతులు మరియు స్థానిక ప్రజలకు చల్లని తాగునీరు, మజ్జిగ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేస్తూ వేసవి కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని కోరారు. కార్యక్రమం సామాజిక ఐక్యతను ప్రతిబింబిస్తూ విజయవంతంగా ముగిసింది.

# మద్యం మత్తులో గ్రామస్తులపై దాడి

**- మూలపాడు గ్రామస్థులపై దాడికి పాల్పడ్డ కృష్ణలంక వాసులు - ఐదుగురికి గాయాలు.. పెట్రోల్ బంకు వద్ద ఘటన- రెండు వర్గాలపై కేసులు నమోదు**



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 27 (వార్తా ప్రభ ప్రతినిధి):** మూలపాడు పెట్రోల్ బంకు వద్ద గ్రామస్థులపై విజయవాడకు చెందిన వర్గం దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం, సేకరించిన సమాచారం ప్రకారం మూలపాడు గ్రామానికి చెందిన వారు లారీల్లో డీజిల్ నింపుకుని బంకు నుంచి బయటకు వస్తున్నారు. విజయవాడ కృష్ణలంకకు చెందిన సుమారు 50 మంది పెనుగంచిప్రోలు వెళ్లి వస్తూ డీజిల్ కోసం బంకు బయటకు వెళ్లే మార్గంలో నుంచి రెండు లారీల్లో లోపలికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బయటకు వస్తున్న మూలపాడు వాహనాలు, లోపలికి వెళ్తున్న కృష్ణలంక వాహనాలు ఎదురుపడ్డాయి. వ్యతిరేక మార్గంలో వచ్చిన విజయవాడకు చెందిన వారు మూలపాడు గ్రామస్థులతో వాగ్వాదానికి దిగారు. రెండు వర్గాల మధ్య మాటామాటా పెరగడంతో ఘర్షణకు దిగారు. రెండు వర్గాలు తోపులాటకు దిగాయి. సుమారు 50 మంది ఉన్న కృష్ణలంక బ్యాచ్ మూలపాడు గ్రామస్థులపై దాడికి పాల్పడగా ఐదుగురు గాయపడ్డారు. మద్యం మత్తులో కృష్ణలంక వాసులు ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. వీరిని పోలీసులు పరీక్షించకుండా వదిలేసినట్లు సమాచారం. ఈ ఘటనపై మూలపాడుకు చెందిన గరికపాటి కోటేశ్వరరావు, కృష్ణలంకకు చెందిన నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు రెండు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బ్యూటీషియన్, టైలరింగ్ శిక్షణతో మహిళలకు ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 27 (వార్తా ప్రభ ప్రతినిధి):** మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు బ్యూటీషియన్, టైలరింగ్ శిక్షణ దోహదపడుతుందని హైకోర్టు న్యాయవాది వైట్ల కృష్ణ ప్రసన్న అన్నారు. కొండపల్లి కొత్త బీ కాలనీ వద్ద యాంబర్ అండ్ డ్యూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏస్తటిక్స్ అండ్ బోటిక్ అకాడమిని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యూటీషియన్, టైలరింగ్ లో గ్రామీణ ప్రాంత మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు అకాడమిని ప్రారంభించడం శుభపరిణామమన్నారు. ఈ అకాడమిలో శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి సాధించే అవకాశం ఉందన్నారు. బ్యూటీషియన్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. మహిళా సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కృషి చేస్తున్నాయని వివరించారు. నిరుద్యోగ యువతులు, మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రైనర్ తార మాట్లాడుతూ యాంబర్ అండ్ డ్యూ ఇన్‌స్టిట్యూట్ ద్వారా బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. రెండు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి కల్పించి స్కిల్ ను బట్టి వేతనాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొప్రైటర్ చింతల కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ లో పెట్రోలు బంకు లని తనిఖీలు చేసిన పశ్చిమ తహసీల్దార్ దాసరి రిబ్కా రాణి





**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రం లో పెట్రోల్, డీజిల్ కొరత వార్తల నేపథ్యంలో, విజయవాడ వెస్ట్ తహశీల్దార్ శ్రీమతి దాసరి రిబ్కా రాణి సోమవారం ఉదయం తమ పరిధి లోని చిట్టినగర్ ఐ ఓ సి బంక్ ల ల్లో, పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పెట్రోల్ బంకుల యజమానులు ఇంధనాన్ని దాచిపెడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో పెట్రోల్ బంకులను తనిఖీ చేసి, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ముఖ్య పరిణామాలు నో స్టాక్ బోర్డు,బ్లాక్ మార్కెటింగ్ విషయం లో ఆమె బంకు యజమానులను గట్టిగా హెచ్చరించారు. ఇంధనం దాచిపెట్టిన బంకుల యజమానులకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. భయాందోళనతో వినియోగదారులు పెట్రోల్ దొరకదనే వార్తలతో ప్రజలు పెద్ద సంఖ్యలో బంకులకు రావడంతో, ఉన్న స్టాక్ వెంటనే అయిపోతోందని అధికారులు కు డీలర్లు చెబుతున్నారు. సరఫరాలో అంతరాయం రవాణాలో స్వల్ప అంతరాయాల వల్ల కొన్ని చోట్ల కొరత ఏర్పడిందని, స్టాక్ సరిపోను ఉందని డీలర్ల విన్నవించుకున్నారు వాహనదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగినంత ఇంధనం సరఫరా జరుగుతోందని రెండు రోజుల్లో మాములు పరిస్థితి ఏర్పడుతుందని, అవసరాన్ని మించి వాడకం చెయ్యొద్దన్ని ఈ సందర్భముగా వినియోగదారులకు తహసీల్దార్ రిబ్కా రాణి విజ్ఞప్తి చేశారు.

# తృతీయ సోపాన్ గైడ్స్ శిక్షణ సేవ కార్యక్రమం






**మచిలీపట్నం: ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ సెంటర్ చిలకలపూడి మచిలీపట్నం నందు ఈనెల 24నుండీ 28వరకు తృతీయ సోపాన్ గైడ్స్ శిక్షణా కార్యక్రమం జరుగుతోంది. మూడవరోజున శిక్షణలో భాగంగా 'హైక్' కు ఎల్వోసి రజియా బేగం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న గైడ్స్ నిమంగినపూడి బీచ్ కి తీసుకువెళ్ళారు. ఓలేటి ఉమాసరస్వతి, రాజేశ్వరి, వీరకుమారి గైడ్ టీచర్ల పర్యవేక్షణలో ఉత్సాహంగా బీచ్ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం కేరింతల మధ్య పోటాపోటీగా టగ్గాఫర్ ఆట ఆడారు. బీచ్ ఒడ్డున మార్చ్ ఫాస్ట్ చేయడంవలన పర్యాటకులు గైడ్స్ చేయు చెత్త శుభ్రం చేయుటను శ్రద్ధతో గమనించారు. ఇలా శుభ్రం చేయడంవలనపర్యాటక ప్రదేశాలకు వెళ్ళినప్పుడు చుట్టుపక్కల పరిసరాలలో చెత్త వేయకూడదని తెలుసుకున్నామని గైడ్ విద్యార్థినిలు అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సంచుల్లో నింపి మున్సిపాలిటీ వారు తీసికెళ్ళుటకు వీలుగా పల్లపు ప్రదేశంలో గుట్టగా వేశారు. నివాసిత, పర్యాటక పరిసరాలలో చెత్త నియంత్రణకు పిల్లల్లో అవగాహన కల్పించే ప్రయత్నం అభినందనీయం బీచ్ కు వచ్చిన పర్యాటకులు అన్నారు.

## సివిల్స్ లో సత్తా చాటిన ట్రాఫిక్.సిఐకుమార్తె. హర్షిత మేధరకు....

# గాంధీజీనగరపాలకహైస్కూల్. పూర్వవిద్యార్థులుఆత్మీయసత్కారం



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో గణపతి రావు రోడ్ లో ఏఎస్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో.సివిల్ సర్వీస్. పరీక్షల్లోజాతీయ స్థాయి 520వ ర్యాంకు సాధించిన హర్షిత ను ఘనంగా సన్మానించారు. గాంధీజీ నగరపాలక కళాశాల 1988. 1989 బ్యాచ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు పూర్వ విద్యార్థి అయిన విజయవాడ ట్రాఫిక్ విభాగంలోపనిచేస్తున్న సీ ఐ మేధర సుధాకర్ కుమార్తె హర్షిత కు పూర్వ గాంధీజీ.విద్యార్థులు ఘనంగా సన్మానించుకున్నారు .హర్షిత విద్యాభ్యాసం అంతా విజయవాడలోనే కొనసాగినది ఆమె తల్లి చంద్ర లీల గృహిణి 2021లో బీటెక్ పూర్తి (కంప్యూటర్ సైన్స్) పూర్తి చేసిన హర్షిత సివిల్స్ పై తల్లిదండ్రుల ప్రోత్సహంతో దృష్టి సారించింది. నాలుగవ ప్రయత్నంలో విజయం సాధించిన హర్షితకు శాలువాతో పూల బొకేతో సన్మానించారు ఈ కార్యక్రమంలో .రాష్ట్ర వైఎస్ఆర్సిపి మైనారిటీ కార్యదర్శి బాజీ బాబా పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కుమార్ స్వామి, సెక్రటరీ సతీష్ కుమార్, ఎస్.కె కాజా మధు, తిలక్రాం సింగ్, సయ్యద్ అబ్దుల్ ఖాదర్, హరి పాషా, చంద్ర, నయర్ బాషా, నాగరాజు నాగరాజు, వానపల్లి కృష్ణారావు, అప్పారావు, అక్బర్, మల్లీ దేవేంద్ర, అంజద్ భాషా, కాజా షబ్బీర్, అలీ అన్వర్, ఆదిల్, షావుకారు, సయ్యద్ అబ్దుల్ నాజర్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అభినంద్ కు జయంతి నివాళులు





**గుంటూరు: ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీ కృష్ణ అకాడమీ డైరెక్టర్, వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ సభ్యులు స్వర్గీయ శ్రీ పాశం సర్దార్ అభినంద్ యాదవ్ 41 వ జయంతి సందర్భంగా స్థానిక నాయుడుపేట లోని డంపింగ్ యార్డ్ నివసిస్తున్న నిరుపేదలకు దుస్తులు, బియ్యం, పిల్లలకు స్నాక్స్ తో పాటు భోజనం ప్యాకెట్లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ మాట్లాడుతూ సర్దార్ అభినంద్ విద్యతో విద్యార్థుల జీవితం మార్చిన గురువు, సమాజానికి సేవతో తన వంతు సహాయాన్ని అందించిన చేయూతకారుడు, మాటతో కాకుండా చేతలతో ఆదర్శంగా నిలిచిన మీ వ్యక్తిత్వ జీవితం, ఆశయాలు, విలువలు, ముఖ్యంగా ఎవరికి తలవంచని నైజం, జీవిత పోరాటతత్వం భావితరాలకు దారి చూపుతూనే ఉంటాయి అన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం మన పరిసర ప్రాంతాలలో నివసించే నిరుపేదలకు ఒక పూట అన్నం పెట్టడం చాలా మంచి కార్యక్రమం మనమందరం కూడా నెలలో కొంత డబ్బులు కేటాయించుకుని వాటితో మనకి వీలైనంతవరకే నిరుపేదలకు అన్నదానం చేయడం వల్ల వారి ఆకలి తీర్చిన వారు అవుతాం కాబట్టి ప్రతి ఒక్కరు కూడా అన్నదానం కార్యక్రమంలో భాగస్వామి అవ్వడం చాలా అవసరం అని ట్రస్ట్ సభ్యులు కోనంకి మురళీకృష్ణ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో యోగ రామకృష్ణ, చరణ్, దుర్గాప్రవీణ్, సాయి తేజ, లోహిత్, వినయ్ మరియు భరత్ పాల్గొన్నారు.

## జాతీయ విపత్తు శిక్షణకు ఎంపీడీఓ ఇమ్రాన్...



**గుడ్లవల్లేరు: ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లాలో ఇద్దరు ఎంపీడీఓలు మాత్రమే జాతీయ సమగ్ర విపత్తు నిర్వహణ శిక్షణ కార్యక్రమానికి వెళ్లనున్నారు. అందులో గుడ్లవల్లేరు ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ ఒకరు. ఈ నెల 27నుంచి 30వ తేదీ వరకు ఈ శిక్షణా తరగతులు ఉంటాయి. ఆయన స్థానంలో కాల వ్యవధిలో మండలంలోని పరిపాలనా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుటకు గానూ డెప్యూటీ ఎంపీడీఓ జి.ఎస్.ఎస్. అంజనాదేవి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహించనున్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరియు సంబంధిత వర్గాలు ఈ విషయాన్ని గమనించి, అవసరమైన పరిపాలనా కార్యక్రమముల విషయమై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అంజనాదేవితో సమన్వయం చేసుకొని విధులు నిర్వహించవలసిందిగా ఎంపీడీఓ ఇమ్రాన్ కోరారు.

## త్వరలో లక్ష్మీపురంలో కేడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు



**కృత్తివెన్ను ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృత్తివెన్ను లక్ష్మీపురంలో కేడీసీసీ బ్యాంకు బ్రాంచ్ ను ఏర్పాటు చేయనున్నట్లు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం తెలిపారు. ఆయన స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తో కలిసి లక్ష్మీపురంలో బ్రాంచ్ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం పిఎసిఎస్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండేందుకు బ్రాంచ్ శాఖను లక్ష్మీపురంలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వాణిజ్య బ్యాంకులతో పోలిస్తే సహకార బ్యాంక్ లో వడ్డీ రేట్లు రైతులకు అందుబాటులో ఉంటాయని వివరించారు ఈ సందర్భంగా 1 కోటి 25 లక్షల రూపాయల విలువ చేసి రుణాలు చెక్కులను రైతులకు పంపిణీ చేశారు. సాధ్యమైనంత తొందరగా బ్యాంకు సేవలు రైతులకు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు బ్యాంక్ సీఈఓ ఏ శ్యాం మనోహర్, మేనేజర్ బిఎల్ చంద్రశేఖర్, లక్ష్మీపురం పిఎసిఎస్ చైర్మన్ యాళ్ళ శ్యాంబాబు కోమల్లపూడి పిఎసిఎస్ చైర్మన్ కూనసాని నాగబాబు, టిడిపి మండల అధ్యక్షులు నాగిరెడ్డి చెన్నకేశవరావు ప్రధాన కార్యదర్శి యాదవ రెడ్డి కొండ, సెక్రటరీ మన్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఓవర్‌లోడ్ తో వెళుతున్న ఆటో ను సీజ్ చేసిన మైలవరం సిఐ కిషోర్ బాబు



**మైలవరం: ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఓవర్‌లోడ్ తో వెళుతున్న ఆటో లపై మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.కిషోర్ బాబు చర్యలు చేపట్టారు. సర్కిల్ పరిధిలోని జి.కొండూరు నుంచి పుల్లూరు వైపు వెళ్తున్న ఒక ఆటోను ఆపి తనిఖీ చేయగ ఆ ఆటో లో మొత్తం 16 మంది ప్రయాణికులు మరియు వారి సామాన్లు ఉండటాన్ని గుర్తించారు. పరిమితికి ప్రయాణికులను ఎక్కించుకోవడంతోపాటు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవర్ ఆటో ను అతివేగంగా నడుపుతున్నట్లు సీఐ గుర్తించారు. వెంటనే సీఐ ఆ ఆటోను నిలిపివేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు కఠిన హెచ్చరిక లు జారీ చేశారు. వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్ సీ)లో పేర్కొన్న పరిమితికి మించి ప్రయాణి కులను ఎక్కించడం చట్ట విరుద్ధమని, అతివేగం గా వాహనం నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే చట్టపరమైన చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమై తే వాహన యజమానిపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. నిర్దేశిత సామర్థ్యానికి మించి ఆటో లో లోడ్ చేయడం వలన సెంటర్ ఆఫ్ గ్రావిటీ అసమతుల్యం కావడం, బ్రేకింగ్ సామర్థ్యం తగ్గిపోవడం, టైర్లపై అధిక ఒత్తిడి పెరగడం వలన టైర్లు పేలే ప్రమాదం ఉందని తెలిపారు. దీంతో వాహనం అదుపుతప్పి తీవ్రమైన ప్రమాదాలకు దారితీసే అవకాశముంద ని డ్రైవర్లకు వివరించారు. ఇలాంటి ప్రమాదాల వల్ల అమాయకుల ప్రాణాలు పోగొట్టుకోవడం మాత్రమే కాకుండా, ఎదురుగా వచ్చే ఇతర వాహనదారులు కూడా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రయాణికులు కూడా అధికంగా ప్రయాణికులు ఉన్న ఆటోలలో ప్రయాణించకుండా జాగ్రత్తలు పాటించాలని, భద్రతా నియమాలను కచ్చితంగా అనుసరించా లని సీఐ కిషోర్ బాబు విజ్ఞప్తి చేశారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని గుర్తు చేశారు.

# తెలంగాణ రాష్ట్ర సేన కొత్త శక్తి!!

**● కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయం? ● జయలలిత, మమతా తరహా నాయకత్వం సాధ్యమా? ● కవితమ్మ వ్యక్తిత్వం, సాంస్కృతిక అనుబంధం- బలమా? ● కుటుంబ రాజకీయాల ముద్ర, కేడర్ లోపం - బలహీనతనా? ● ప్రతిపక్ష పోటీకి కొత్త ప్రత్యామ్నాయం 2028 ఎన్నికలలో పరీక్ష**




**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 27 (వార్తాప్రభ ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) కవితమ్మ ఆధ్వర్యంలో కొత్తగా ఆవిర్భవించింది. ఇది కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయ శక్తిగా నిలవగలదా అన్నది రాబోయే రోజుల్లో ప్రజల స్పందన, పార్టీ నిర్మాణం, కవితమ్మ నాయకత్వంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఇది తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయ్యి, 2026 ఏప్రిల్ 25న తెలంగాణ రాష్ట్ర సేన అనే కొత్త పార్టీని ప్రకటించారు. పార్టీ పేరు టీఆర్ఎస్ గా పెట్టడం ద్వారా, పాత తెలంగాణ రాష్ట్ర సమితి గుర్తింపును తిరిగి తెచ్చే ప్రయత్నం చేశారు. ఆమె కాంగ్రెస్ ప్రభుత్వాన్ని "అధికార దుర్వినియోగం"గా, బీజేపీని "తెలంగాణ వ్యతిరేకం"గా, బీఆర్ఎస్‌ను "ఆత్మలేని పార్టీ"గా విమర్శించారు.

**ప్లస్ పాయింట్స్** ప్రజా గుర్తింపు: టీఆర్ఎస్ అనే పేరు పాత తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది బలమైన గుర్తింపును కలిగిస్తుంది. కవితమ్మ వ్యక్తిత్వం: ఆమెను "తెలంగాణ టైగర్"గా, "సీఎం"గా నినాదాలు చేశారు. ఇది ప్రజల్లో ఉత్సాహాన్ని పెంచింది. సాంస్కృతిక ఆధారం: తెలంగాణ జాగృతి ద్వారా బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజలతో అనుబంధం ఉంది. ప్రత్యామ్నాయ శక్తి: కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లపై తీవ్ర విమర్శలు చేసి, కొత్త ప్రత్యామ్నాయంగా నిలవాలని ప్రయత్నిస్తోంది.

**మైనస్ పాయింట్స్** సంస్థాగత బలహీనత: కొత్త పార్టీకి ఇంకా బలమైన కేడర్, గ్రామస్థాయి నెట్‌వర్క్ లేదు. కుటుంబ రాజకీయాల ముద్ర: కవితమ్మ బీఆర్ఎస్ కుటుంబంలో భాగమని ప్రజలు గుర్తుంచుకుంటారు. ఇది ప్రతికూలంగా మారవచ్చు. ప్రతిపక్ష పోటీ: కాంగ్రెస్ అధికారంలో ఉంది, బీజేపీ జాతీయ స్థాయిలో బలంగా ఉంది, బీఆర్ఎస్‌కు ఇంకా గ్రామీణ స్థాయిలో మద్దతు ఉంది. నాయకత్వ సవాలు: జయలలిత, మమతా బెనర్జీ మాదిరి కఠినమైన, ప్రజలను ఆకర్షించే నాయకత్వం కవితమ్మ చూపగలదా అన్నది ఇంకా అనిశ్చితి. కవితమ్మకు సాంస్కృతిక, ఉద్యమ అనుబంధం ఉన్నా, జయలలిత, మమతా స్థాయి రాజకీయ చతురత, ప్రజా ఆకర్షణ సాధించడానికి సమయం పడుతుంది. భవిష్యత్తు: టిఆర్ఎస్ ప్రభావం 2028 అసెంబ్లీ ఎన్నికల్లో స్పష్టమవుతుంది. అప్పటివరకు పార్టీ నిర్మాణం, ప్రజా మద్దతు, కవితమ్మ వ్యూహం కీలకం. తెలంగాణ రాష్ట్ర సేన ప్రస్తుతం ప్రజల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది, కానీ ప్రతిపక్ష శక్తిగా నిలవడానికి బలమైన కేడర్, స్పష్టమైన వ్యూహం, ప్రజా విశ్వాసం అవసరం. కవితమ్మకు జయలలిత, మమతా స్థాయి రాజకీయ చతురత సాధించగల సామర్థ్యం ఉందా అన్నది రాబోయే ఎన్నికలు నిర్ణయిస్తాయి. ఏది ఏమైనా మహిళా శక్తి దేశానికైనా, రాష్ట్రానికైనా, గ్రామాలకైనా రాజకీయాల్లో ఎంతో అవసరం అనేది జగమెరిగిన సత్యం.

# స్లాబ్ వేశారు.....లక్షణంగా వదిలేశారు

**● చంద్రగూడెంలో అసంపూర్తిగా గ్రామ సచివాలయం-1 భవన నిర్మాణం ● గ్రామపంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్న రెండు సచివాలయాల సిబ్బంది ● ఇరుకు గదుల్లో ఇబ్బంది పడుతున్న సిబ్బంది ● అస్తవ్యస్తంగా గ్రామ సచివాలయల పాలన**





**మైలవరం : ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండల పరిధిలోని చంద్రగూడెం గ్రామ పంచాయితీ కార్యాలయం భవనంపై నిర్మిస్తున్న గ్రామ సచివాలయం -1 భవన నిర్మాణాన్ని అసంపూర్తి గా వదిలేశారు. గత ప్రభుత్వం హయాంలో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టారు. 2021లో భవన నిర్మాణ పనులు ప్రారంభించి గుత్తేదారు పిల్లర్లు పోసి వాటిపై స్లాబు వేసి లక్షణంగా వదిలేశారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల స్థలంలో గ్రామ సచివాలయం -1 భవనం నిర్మించారు. అయితే అప్పట్లో కోర్టు ఆదేశాల మేరకు ఆ భవనాన్ని విద్యాశాఖ స్వాధీనపర్చుకొని ఆ భవనంలో స్కూల్ రన్ చేస్తున్నారు. దీంతో గ్రామపంచాయి తీ కార్యాలయాన్ని గ్రామ సచివాలయం-2 గా, అదే గ్రామ పంచాయితీ భవనం పై గ్రామ సచివాలయం-1 కోసం భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే గుత్తేదారుకి బిల్లులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా వదిలేశా రు. తరువాత ప్రభుత్వం మారడంతో భవన నిర్మాణపనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గ్రామ పంచాయితీ కార్యాలయంలోనే రెండు గ్రామ సచివాలయాల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ సచివాలయం-1 లో 8 మంది, అలాగే గ్రామ సచివాలయం-2లో గ్రేడ్-5 తో కలిపి 9మంది సిబ్బంది మొత్తం 17 మంది సిబ్బంది ఇరుకు గదుల్లో విధులు నిర్వహిస్తున్నా రు.

**అస్తవ్యస్తంగా గ్రామ సచివాలయల పాలన:** గ్రామపంచాయతీ కార్యాలయం చిన్న భవనంలో గ్రామ సచివాలయల పాలన అస్తవ్యస్తంగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నా రు. పనుల కోసం కార్యాలయానికి వెళ్తే ఒకరు ఉంటే ఒకరు ఉండరని, అదేమంటే ఫీల్డ్ లో ఉన్నామని చెబుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఎవరు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో కూడా తెలియదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇరుగు గదులు కావడం, కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం, పాడైపోయిన ఫర్నిచర్, ఇతర పనికిరాని వస్తువులన్నీ కూడా గ్రామపంచాయతీ కార్యాలయంలోనే పడేయడం వల్ల కార్యాలయం మరింత ఎరుకుగా మారిందని అంటున్నారు. ఇలా ఎన్నాళ్ళు అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం భవనం పైన నిర్మించే గ్రామ సచివాలయం-1 నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఆయిల్ బంకుల వద్ద సాధారణ స్థితికి డీజిల్ పెట్రోల్...

**● ఆయిల్ కంపెనీ నుండి ఆదనంగా డీజిల్ పెట్రోల్ సరఫరా... ● డీజిల్ పెట్రోల్ సరఫరా పై వదంతులను నమ్మవద్దు... ● వదంతులను సృష్టించేవారిపై కఠిన చర్యలు..● జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, సిపి ఎస్.వి రాజశేఖర్ బాబు లు వెల్లడి**




**విజయవాడ, ఏప్రిల్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో ఆయిల్ బంకులకు అవసరమైన డీజిల్ పెట్రోల్‌ను సరఫరా చేసేందుకు ఆయిల్ కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని పెట్రోల్ డీజిల్‌కు కొరత ఉందని రేట్లు పెరిగే అవకాశం ఉందనే వదంతుల కారణంగా వినియోగదారులు అవసరానికి మించి పెట్రోల్ డీజిల్‌ను కొనుగోళ్ళు చేస్తున్న కారణంగా బంకుల వద్ద ఇబ్బంది కర పరిస్థితులు ఏర్పడ్డాయని జిల్లా యంత్రంగం తీసుకున్న చర్యల కారణంగా బంకుల వద్ద రద్దీ దాదాపుగా తక్కుముఖం పట్టిందని వదంతులకు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబులు తెలిపారు.

పెట్రోల్ డీజిల్ సరఫరా పరిస్థితులపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని శ్రీ ఎవిఎస్ రెడ్డి వీడియోకాన్ఫరెన్స్‌హాల్ నందు జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ, పోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియాలు మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 186 పెట్రోల్ బంకుల ద్వారా వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ సరఫరా జరుగుతుందన్నారు. కొండపల్లి ప్రాంతంలోని ఆయిల్ కంపెనీల నుండి మరో 10 జిల్లాలకు డీజిల్ పెట్రోల్ సరఫరా చేస్తున్నారన్నారు. సోషల్ మీడియా ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా డిజిల్ కొరత ఉందనే అసత్య ప్రచారాలను నమ్మి వాహనదారులు రోజు వారి కొనుగోళ్ళు చేసే డీజిల్ పెట్రోల్ అదనంగా ఫుల్ ట్యాంకులు చేయించుకోవడంతో కొంత గందరగోళ పరిస్థితులు ఏర్పాడాయన్నారు. జిల్లాలో ప్రతి రోజు బంకులకు ఆయిల్ కంపెనీల నుండి 3 లక్షల లీటర్ల పెట్రోల్ 5 లక్షల లీటర్లకు పైగా డీజిల్ సరఫరా చేయడం జరిగేదన్నారు. కొరత కారణంగా మరో 10 శాతం అదనంగా సరఫరా చేసేందుకు ఆయిల్ కంపెనీలు సంసిద్ధత వ్యక్తం చేశాయన్నారు. జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యల కారణంగా పెట్రోల్ బంకుల వద్ద కొంత మేర రద్దీ తగ్గిందన్నారు. సరఫరా చేసిన డీజిల్ పెట్రోలు సజావుగా వినియోగదారులకు అందజేసేందుకు రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులతో ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రత్యేక టీమ్ లు పెట్రోల్ బంకులను సందర్శిస్తూ, నిల్వలు, సరఫరా, వినియోగ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయని వివరించారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేసి మోనిటరింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డీజిల్ పెట్రోల్ సరఫరా చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసిన్నట్లు ఆయన తెలిపారు. అవసరమైతే అదనపు ట్యాంకర్ల ద్వారా సరఫరా పెంచేందుకు ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇంధన సరఫరా పూర్తిగా నియంత్రణలో ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇంధన సరఫరాపై ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, ఇందుకోసం కంట్రోల్ రూము ఏర్పాటు చేయడం జరిగిందని వినియోగదారులకు ఇబ్బంది తలెత్తిన పక్షంలో 91549 70454 నందు సంప్రదించవచ్చని సూచించారు. మరో ఒకటి రెండు రోజులలో డీజిల్ పెట్రోల్ అమ్మకాలు సాధారణ స్థితికి చేరుతాయని జిల్లాకలెక్టర్ డా.జి. లక్ష్మీశ తెలిపారు. నగరపోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ఆయిల్ కంపెనీల నుండి పెట్రోల్ బంకులకు అవసరమైన డీజిల్ పెట్రోల్ సరఫరా చేసేందుకు అవసరమైన నిల్వలు సిద్ధంగా ఉన్నాయాన్నారు. వదంతుల కారణంగా ఆందోళన ఏర్పడి సాధారణ కొనుగోళు కంటే అదనంగా కొనుగోలు చేయడం జరిగిందని దీనితోపాటు తిరిగే అవసరం లేకపోయిన ఆయిల్ దొరకదేమోనని క్యూ లో ఉండి సైతం ఆయిల్ పోయించుకోవడానికి ముందుకు రావడంతో బంకుల వద్ద వాహనాల క్యూ పెరిగిపోవడం జరిగిందన్నారు. సైబర్ క్రైమ్ పోలీసులను అప్రమత్తం చేశామని సోషల్ మీడియాలో వదంతుల ప్రచారం చేసేవారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా మాట్లాడుతూ డీజిల్ పెట్రోల్ సరఫరా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. వ్యవసాయం, ఆక్వా రంగం, ఆస్పత్రులు మరియు అంబులెన్స్ అవసరాలను ప్రధాన ప్రాధాన్యతగా గుర్తించి డీజిల్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. కమర్షియల్ డీజిల్ వినియోగదారులు కూడా రిటైల్ బంకుల వైపు రావడం వల్ల కొంతమేర డిమాండ్ పెరిగిందని చెప్పారు. ప్రైవేట్ పెట్రోల్ బంకుల్లో కొంతమేర అధిక ధరలు వసూలు చేస్తున్న అంశాన్ని గమనించామని, దీనిపై సంబంధిత అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బంకు యజమానులు పూర్తి స్థాయిలో చెల్లింపులు చేస్తున్నారని, ఆయిల్ కంపెనీలు కూడా అదనపు సరఫరా అందిస్తున్నాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో సరఫరా సమృద్ధిగా ఉన్నందున ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉందని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా తెలిపారు.

## పెనుగంచిప్రోలు లో పెట్రోల్, డీజిల్ కొరత లేదు - తహసీల్దార్ శాంతి లక్ష్మి.



**పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 27( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు లో పెట్రోలు బంకుల నుంచి పెట్రోల్, డీజిల్, నిల్వల సమాచారన్ని అధికారులు సేకరించారు. బైక్ కు 2 లీటర్లు, కారు కు 10 లీటర్లు, లారికి 50 లీటర్లు, అందిస్తున్నారు, రైతులకు మాత్రం వీఆర్వో నుంచి వ్యవసాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ తెచ్చిన వారికి ఎకరానికి 8 లీటర్లు చొప్పున క్యాన్ లలో నింపి పంపిస్తున్నట్లు తహసీల్దార్ శాంతి లక్ష్మి సోమవారం తెలిపారు. పెట్రోల్, డీజిల్, పై వస్తున్నా వదంతులను నమ్మ వద్దని ఆమె సూచించారు.

## సత్యం మాస్టారుకు రామదాసు సాహితీ కళా సేవ, విశ్వ విఖ్యాత సంస్థల ఘన సన్మానం.....



**పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 27( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలుకు చెందిన ఉపాధ్యాయ రచయిత ముక్కా సత్యనారాయణను రామదాసు సాహితీ కళా సేవా సంస్థ, విశ్వ విఖ్యాత సాహితీ సంస్థ హైదరాబాద్ భారతీయ వికాస్ పరిషత్ భవన్ లో ఘనంగా సన్మానించారు. రామదాసు సాహితీ కళా సేవా సంస్థ మూడవ వార్షికోత్సవ సందర్భంగా కొన్నేళ్లుగా సత్యం మాస్టారు చేసిన సాహిత్య సేవలకు ఈ సత్కారం లభించింది. భూగర్భ గనుల శాఖ విశ్రాంత డైరెక్టర్ వి ఎస్ రాజగోపాల్, దూత రామ కోటేశ్వరరావు,భీమా శ్రీనివాస్, కుసుమ ధర్మన్న కళా పీఠం వ్యవస్థాపకురాలు కుసుమ రాధ, ప్రముఖ సాహితీవేత్త ఘంటా మనోహరరెడ్డి, ప్రపంచ ఫాస్టెస్ట్ పియానో ప్లేయర్ సతీష్ కుమార్ ల చేతి మీదుగా ఈ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణను పలువురు అభినందించారు.

## కైకలూరులో ఘనంగా మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణ స్వీకారం.

**చైర్మన్‌గా పెనుమచ్చ త్రినాథ రాజు బాధ్యతలు స్వీకారం**
**రైతులకు అంకిత భావంతో సేవలందిస్తానని హామీ**



**కైకలూరు ఏప్రిల్ 27 (వార్తా ప్రభ)**ఏలూరు జిల్లా కైకలూరు మండలంలోని కైకలూరు మార్కెట్ యార్డ్‌లో నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా పెనుమచ్చ త్రినాథ రాజు బాధ్యతలు స్వీకరించారు. కైకలూరు ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రాంతీయ రాజకీయ వర్గాలలో విశేష ఆకర్షణగా నిలిచింది. వివిధ నియోజకవర్గాల నుంచి పలువురు ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, చింతలపూడి ఎమ్మెల్యే సోంగా రోషన్ కుమార్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నారాయణ నాయకర్, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కూటమి నాయకులు కమ్మిలి విఠల్ రావు, రాష్ట్ర చేపల రైతుల సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, టిడిపి నాయకులు బూరుపోయిన శ్రీనివాసరావు, రామకృష్ణ, బొమ్మనుబోయిన విజయలక్ష్మి, బలే యేసు రాజు, కొడాలి వినోద్, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, జోగిరాజు, ఆంద్రాజు శ్రీనివాస్ రావు, జనసేన నాయకులు నల్లగోపుల వెంకట చలపతి, ఏ ఎన్ బాబు తదితరులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్ పెనుమచ్చ త్రినాథ రాజు మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, రైతుల సంక్షేమం కోసం మార్కెట్ యార్డ్‌ను సమర్థవంతంగా నడిపిస్తానని తెలిపారు. రైతులకు మేలు చేసే విధంగా నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్త కమిటీకి అభినందనలు తెలిపారు.

## కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

**అభద్రతా భావం వద్దు అనవసర వదంతులు నమ్మవద్దు**
**అవసరానికి మించి ఆయిల్ సరఫరా**
**పెట్రోల్ బంకులను తనిఖీ చేసిన ఇబ్రహీంపట్నం తాసిల్దార్ వై వెంకటేశ్వర్లు**





**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 27(వార్తా ప్రభ ప్రతినిధి):**పెట్రోల్ బంకుల్లో కృత్రిమ ఆయిల్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అనవసర వదంతులు నమ్మవద్దని వినియోగదారులకు సరిపడా ఆయిల్ అందుబాటులో ఉందని తెలిపారు ఇబ్రహీంపట్నం తాసిల్దార్ వై వెంకటేశ్వర్లు. సోమవారం ఇబ్రహీంపట్నం, కొండపల్లి పెట్రోల్, డీజిల్ ఫీలింగ్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. నిర్వాహకులతో మాట్లాడి సూచనలు చేశారు. నిత్యం సరఫరా కంటే 15 శాతం ఎక్కువగా బంకులకు ఆయిల్ వచ్చే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజలు అభద్రత భావంతో డిమాండ్ పెరిగిందన్నారు. డ్రమ్ముల్లో, క్యాన్లలో పెట్రోల్ నింపరాదని, పరిమితంగా వాహనాలకు అందజేయాలని హెచ్చరించారు. పెట్రోల్ బంకుల వద్ద పర్యవేక్షణకు అధికారును నియమించమన్నారు. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రజలు అనవసర వదంతులు నమ్మరాదని తెలిపారు. వ్యవసాయ అవసరాలకు స్థానిక అధికారుల అనుమతితో డీజిల్ తీసుకువెళ్లాలని సూచించారు. పౌర సరఫరాల శాఖ డిటి రామకృష్ణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## స్టేడియం ఆధ్వర్యంలో 1నుండి వేసవి శిక్షణా శిబిరం

- పూర్తిచేసిన అప్లికేషన్స్ దాఖలు చేయుటకు ఆఖరు తేది : 28-04-2026



**గుడివాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** ఎన్.టి.ఆర్. స్టేడియం కమిటీ ఆధ్వర్యములో ఎన్.టి.ఆర్. స్టేడియం నందు గుడివాడ మరియు పరిసర ప్రాంతములలోని 15 సంవత్సరములలోపు బాలబాలికలకు ది.01-05-2026 నుండి 28-05-2026 వరకు సమ్మర్ కోచింగ్ క్యాంప్ - 2026 కు ఏర్పాట్లు పూర్తయ్యాయని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అథ్లెటిక్స్, బాస్కెట్బాల్, శాస్త్రీయ నాట్యం (బాలికలకు మాత్రమే) చెస్, క్రికెట్, కబడ్డీ, కరాటే, ఖో-ఖో, షటిల్, స్కేటింగ్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, పాశ్చాత్య నృతం (బాలురకు మాత్రమే), యోగా, కర్రసాము.. ఈ వేసవి క్రీడా శిక్షణా తరగతులలో చేరిన బాలబాలికలకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం శాస్త్రీయ నాట్యం, ఉదయం అనుభవజ్ఞులైన కోచ్లచే శిక్షణ ఇవ్వబడును. శిక్షణానంతరం ప్రతిరోజు ఉదయం మరియు సాయంత్రం డైట్ ఇవ్వబడును. శిక్షణ కాలం పూర్తయిన తరువాత సర్టిఫికెట్లు ఇవ్వబడును. వేసవి శిక్షణా తరగతులలో చేరగోరు బాలబాలికలు స్టేడియం ఆఫీసులో ది. 16-04-2026 నుండి ఇచ్చుచున్నారు. పూర్తిచేసిన ధరఖాస్తు ఫారమునకు ఆధార్ జిరాక్స్ కాపి జతచేసి తల్లిదండ్రులచే సంతకం చేయించి ది.28-04-2026 లోపు ఇవ్వవలయును. ఒక్క అప్లికేషన్ మాత్రమే పూర్తిచేసి ఇవ్వవలెను. అప్లికేషన్లు స్టేడియం ఆఫీసునందు లభించును. ఈ సమావేశంలో కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ లు పాల్గొన్నారు.

## గుడివాడలో ఆర్ఆర్ఆర్ కేంద్రానికి విశేష స్పందన



**గుడివాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** గుడివాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ప్రారంభించిన ఆర్ఆర్ఆర్ కేంద్రానికి ప్రజలు, ఉద్యోగుల నుండి విశేష స్పందన లభిస్తోంది. కేంద్రం ప్రారంభమైన నాటి నుండి పునర్వినియోగానికి అనువైన వస్తువులను పెద్ద ఎత్తున అందజేస్తున్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ స్వయంగా ఆర్ఆర్ఆర్ కేంద్రానికి 15 కిలోలకు పైగా ఉపయోగించ గలిగే బట్టలు, పిల్లల బొమ్మలు, టెలివిజన్తో పాటు పలు ఎలక్ట్రికల్ పరికరాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజలు మరియు ఉద్యోగులు ఇలాంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పాత బట్టలు, పుస్తకాలు, బొమ్మలు, గృహోపకరణాలు, ప్లాస్టిక్ వస్తువులు మరియు పునర్వినియోగానికి అనుకూలమైన ఇతర వస్తువులను ఆర్ఆర్ఆర్ కేంద్రానికి అందించాలని సూచించారు. వాడకంలో లేని ఉపయోగించదగిన వస్తువులను ఆర్ఆర్ఆర్ కేంద్రానికి అందించి, పునర్వినియోగం ద్వారా సమాజానికి మేలు చేయాలని కమిషనర్ తెలిపారు.

## ఖర్గే వ్యాఖ్యలు.. ప్రజలను అవమానించడమే. !



**గుడివాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. ప్రధాన మోదీని 'తీవ్రవాది'గా సంబోధించడం దేశ ప్రజలను అవమానించడమేనని మచిలీపట్నం పార్లమెంట్ కన్వీనర్ కృష్ణా జిల్లా భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు సూరే లక్ష్మీనారాయణ (గాంధీ) అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పై ఈనెల 20వ తారీకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై కేంద్రంగా విలేకరుల సమావేశంలో భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే చేసిన ఉగ్రవాది అనే వ్యాఖ్యల పట్ల యావత్ భారతదేశం ఖండిస్తుందని వెంటనే మల్లికార్జున ఖర్గే ని అరెస్టు చేయాలని, పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేసి కఠినంగా శిక్షించాలని సూరే గాంధీ నేతృత్వంలో సోమవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అంగడాల సతీష్ ఒకటో పట్టణ అధ్యక్షులు కోనేటి వెంకటేష్ రెండో పట్టణ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు శలంకాయల లీలా కుమారి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు సాంబయ్య బీజేవైఎం జిల్లా కార్యదర్శి గాదంశెట్టి ఫణి కుమార్ జిల్లా అధికార ప్రతినిధి కొత్త కిరణ్ సీనియర్ నాయకులు మాకాని జనార్ధన్ కొత్త వెంకట చలపతిరావు తిరుపాల్ గుప్తా చంద్రమౌళేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

## 'హెచ్పివి వ్యాక్సినేషన్' పై అవగాహన శిక్షణ కార్యక్రమం

**గుడివాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** దేశవ్యాప్తంగా మహిళల్ని సర్వైకల్ క్యాన్సర్ బారి నుంచి రక్షించేందుకు కేంద్రం ఓ భారీ కార్యక్రమం చేపడుతోంది. ఇందులో భాగంగా 14 ఏళ్ల వయస్సుకన్న బాలికలకు ప్రత్యేక హ్యూమన్ పాపిల్లోమావైరస్ (హెచ్పివి) టీకా వేయబోతున్నారు. ఈ క్రమంలో స్థానిక డా॥ పొట్లూరి గంగాధరరావు ఐ.యమ్.ఏ. హాల్ నందు ఆదివారం ఉదయం హెచ్.పి. వి వ్యాక్సినేషన్ అవేర్నస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కాగ ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఐ.యమ్.ఏ స్టేట్ అధ్యక్షుడు డా॥ బాలరాజు, సెక్రటరీ డా॥ యమ్.ఎస్.సి బోస్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐ.యమ్.ఏ గుడివాడ ప్రెసిడెంట్ డా॥ యమ్ సుందరయ్య, సెక్రటరీ డా॥ డి. సూరజ్, వైస్ ప్రెసిడెంట్ డా॥ యు. సురేష్ బాబు ఐ.యమ్.ఏ. మాజీ ప్రెసిడెంట్ డా॥ మాగంటి శ్రీనివాస్, స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ డా॥ భవానిశంకర్, డా॥ రామకృష్ణ ప్రసాద్, డా॥ పి. వంశీ కృష్ణ, డా॥ పి. వెంకటరావు, డా॥ ఎస్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

- రాజేంద్రనగర్లో 45కె.వి సోలార్ యూనిట్ ప్రారంభించిన ఎమ్మెల్యే రాము..



**గుడివాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** విద్యుత్శాఖ అధికారులు పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. స్థానిక రాజేంద్రనగర్ మూడో లైన్ లోనీ గాయత్రి అపార్ట్మెంట్స్ పీఎం సూర్య ఘర్ పథకంలో భాగంగా ఏర్పాటుచేసిన 45 కె.వి సోలార్ ప్యానల్స్ ను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం ఉదయం ప్రారంభించారు. అనంతరం సోలార్ ప్యానల్స్ ఏర్పాటు వల్ల నివాసితులకు కలిగే ప్రయోజనాలను, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వివరాలను విద్యుత్ శాఖ అధికారులు ఎమ్మెల్యే రాముకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ గుడివాడలో ఇది మంచి పరిణామం అని హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో ఉన్న ఇతర అపార్ట్మెంట్ నివాసితులు కూడా ఇంత మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, విద్యుత్ ఆదా చేయాలనే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, విద్యుత్ శాఖ డి.ఈ. బాబి రాజు, ఏ.ఈ. లు బ్రహ్మానందరావు, ఉషా, అపార్ట్మెంట్ కమిటీ పెద్దలు దొండపాటి ప్రభాకర్ రావు, తిపురనేని కోటేశవరావు, ఉప్పాల ప్రతిత్ బాబు, వెంకట సుబ్బారావు, అన్నే మురళి, తదితర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ వనిత విధర్భపురి ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి జన్మదిన వేడుకలు





**గుడివాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** అంగరంగ వైభవంగా కన్యకా పరమేశ్వరి జన్మదిన వేడుకలు వేడుకల్లో భాగంగా వాసవి క్లబ్ వనిత విదర్భపురి గుడివాడ ఆధ్వర్యంలో స్త్రీలచే కుంకుమ పూజలు నిర్వహించారు. 108 మంది సుహాసిని లకి మంగళప్రదమైన శంఖులు పంచి కుంకుమ పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విశేషంగా ఒక్కొక్కరికి 108 శంఖములు చొప్పున సుమారుగా 125 మందికి పూజకు ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళ ఉషారాణి, పెరుమాళ్ళ సుగుణ, శేగు పావని లు సహాయ సహకారాలు అందించారు. అదేవిధంగా పూజలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పుస్తకాలు పంచిపెట్టారు. క్లబ్ ప్రెసిడెంట్ వారి టీము బాగా యాక్టివ్ గా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేకమంది దాతలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు. వారందరికీ ప్రెసిడెంట్ వేముల అనసూయ ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా సాయంత్రం అమ్మవారి ఊరేగింపు మేళతాళాలతో కోలాట భజన అంగరంగ వైభవంగా జరిగింది. క్లబ్ సభ్యులు, గోకవరపు సునీల్ సహకారంతో ఊరేగింపులో పాల్గొన మహిళలకు లక్కీడీప్ ద్వారా 12 మందికి చీరలు బహుమతిలగా ఇచ్చారు. ఫాస్ట్ ప్రెసిడెంట్స్ తాత రజనీకుమారి, రవ్వ గిరిజ, నూకల శివజ్యోతి, గిరిజ, కొత్త జ్యోతి, జిల్లా సుధారాణి, తాత పద్మలత, రవ్వ శాంతి, సామీ జ్యోతి, చీదెళ్ళ లక్ష్మి, చలువాది లక్ష్మి సురేఖ వారే కాకుండా కమిటీ సభ్యులు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


# కష్టపడితేనే విజయం వరిస్తుంది



**గుంటూరు, ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** తల్లిదండ్రులను మించిన దైవాలు ఎవరూ లేరని, వాళ్ళ కష్టాన్ని గుర్తించి విద్యార్థులు బాధ్యతగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ముఖ్యంగా యువత ఈ వయస్సులో ఆకర్షణలకు, మత్తుపదార్థాలకు, దూమపానం , మధ్యపానం వంటిచెడు వ్యసనాలకు దూరంగా ఉంటే లక్ష్య చేదనలో మీరు విజేతలుగా ఉంటారని ఈరోజు టి జె పి యస్ కళాశాల లో జరిగిన ఇంటర్, డిగ్రీ, పి జి విద్యార్థులకు బంగారు పథకాలు ఇచ్చేటువంటి ప్రొపిషియన్సి డే సెలబ్రేషన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఇన్స్పెక్టర్ జెనరల్ ఆఫ్ పోలీస్, ఏ రవి కృష్ణ (ఈగల్ నార్కోటిక్స్ కంట్రోల్ యూనిట్ అధికారి ) పేర్కొన్నారు. స్థానిక టి జె పి యస్ కళాశాల లో ఈరోజు "విద్యార్థుల నైపుణ్యాలకు కళాశాల యాజమాన్యం వారు ఇచ్చే బంగారు పథకాల కార్యక్రమం "విజయవంతంగా నిర్వహించబడిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిధిగా విచ్చేసిన కె నగేష్ బాబు( యస్ పి,ఈగల్ టీం ) మాట్లాడుతూ కళాశాల లో విద్యతో పాటు క్రీడలు, లలిత కలలు, ఎన్ సి సి, ఎన్ యస్ యస్, స్పోర్ట్స్ వంటి వాటిల్లో యువత దృష్టి పెట్టాలని, విద్యార్థులను పతనా స్థితిని కలిగించే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. మరొక గౌరవ అతిధిగా విచ్చేసిన కె బి ఎన్ కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండంట్ డాక్టర్ టి శ్రీనివాసు మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన విజయం ఎక్కడో ఉండదని ప్రతి ఒక్కరి మేధస్సులో ఉంటుందని, మీ నైపుణ్యాలకు పదును పెడితే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా విజేతలుగా నిలుస్తారని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పి జి లో ప్రధమ స్థానం సాధించిన విద్యార్థులకు ముఖ్య, గౌరవ అతిధుల చేతుల మీదుగా బంగారు పథకాలు అందించారు. ఈ కార్యక్రమం లో కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండంట్ కె వి బ్రహ్మం,ట్రెజరర్ వి కృష్ణానంద్,పి జి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ అనితా దేవి, వైస్ ప్రిన్సిపాల్ ఏ భాను మురళీధర్ అధ్యాపకులు డాక్టర్ జె వి సుధీర్ కుమార్, మేజర్ పి కుమార్ రాజా, డాక్టర్ యు రవి కుమార్, డాక్టర్ పి దేవేంద్ర గుప్త, జి సురేష్ కుమార్ మరియు డిగ్రీ, పి జి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు


# తులసి తోటలో గంజాయి మొక్క...

- డ్వాక్రాలో ప్రతి ఒక్క రుణానికి వసూల్ రాజానే...
- మంచితనం ముసుగులో మహిళల్ని లొంగదీసుకుంటున్న వైనం...
- తన మాట వినకపోతే ఇంటికేనంటూ చిరు ఉద్యోగులకు అల్టిమేటం...
- ఆఫీసులోనే రాసలీలల్లో మునిగిపోతున్న అధికారి...
- ఆ కార్యాలయం వైపుకు వెళ్లాలంటే...డ్వాక్రా మహిళలకు హడల్...




**గుడ్లవల్లేరు,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** తులసి వనంలో గంజాయి మొక్కలా ఒక అధికారి తయారయ్యాడు. గుడ్లవల్లేరు మండలంలో డ్వాక్రాకు సంబంధించి ప్రతి ఒక్క రుణానికి అతను వసూల్ రాజాగా మారిపోయాడంటే ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ప్రతి రుణానికి ఒక ఫిక్స్డ్ రేటును ఆ అధికారి పెట్టేశాడు. ఒక డ్వాక్రా సంఘానికి బ్యాంకు లింకేజీ రుణం ఇవ్వాలంటే రూ. 2వేలు, స్త్రీనిధికి రూ.వెయ్యి, సామూహిక పెట్టుబడి నిధికి రూ. 500 వసూల్ చేస్తున్నాడు. ఎస్సీ, ఎస్టీ మహిళల వ్యాపార అభివద్ధికి 'ఉన్నతి' పేరిట ఇచ్చే వీఆర్ఎఫ్కు కూడా రూ.వెయ్యి చొప్పున ఆ మహిళల నుంచి గుంజుతున్నాడు. బుక్ కీపర్లలో కొంతమంది తన మనుషులతో ఈ దందా అంతా నడుపుతాడు. ఈ దందాలో ఎవరైనా తాను చెప్పిన పని చేయకపోయినా...అంతే సంగతులు. మంచితనం ముసుగులో మహిళల్ని లొంగదీసుకుంటాడు. ఏ ఒక్క అధికారి, రాజకీయ నాయకులకు సందేహం రాకుండా వారి పనులను త్వరితగతిన పూర్తి చేస్తూ...వినయం నటిస్తాడు. తన మాట వినకపోతే ఇంటికేనంటూ చిరు ఉద్యోగులకు అల్టిమేటం ఇస్తాడు. తనను బదిలీ చేస్తే...ఇదే ఉద్యోగం చేసుకుంటానని...మిమ్మల్ని ఇంటికి పంపితే...పరిస్థితి ఏమిటని చిరుద్యోగులను లొంగదీసుకుంటాడు. మండలంలో 41మంది బుక్ కీపర్లు ఉంటే...అందులో కొంతమందికి రకరకాల సాకులతో వేతనాలు ఆపాడు. సరిగా పని చేయటం లేదని 3నెలలుగా 9మందికి నెలకు రూ. 8వేల చొప్పున వేతనాలను నిలిపివేశాడు. ఈ బుక్ కీపర్లు పూర్తి స్థాయిలోనే పని చేశారు. కేవలం సర్వర్లు పని చేయక కొంత ఆలస్యమైతే...వారిని పని చేయటం లేదన్న సాకుతో సాధించేందుకు వేతనాలు ఆపివేశాడు. ఆఫీసుకు వచ్చే చిరుద్యోగులను ఏంటి...లాడ్జికి వచ్చినట్లు స్టైల్గా వచ్చారు గాని...పని చేయటానికి వచ్చినట్లు లేదన్న పరుష్య పదజాలంతో తిట్టి పోస్తాడు. ఆఫీసులోనే రాసలీలల్లో మునిగిపోతున్న ఈ అధికారి మహిళల పాలిట అభినవ కీచకుడిగా మారాడు. ఆ కార్యాలయం వైపుకు వెళ్లాలంటే...డ్వాక్రా మహిళలు హడలెత్తుతున్నారు. ఇప్పటికైనా ఈ కామ పిశాచిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవలసిందిగా కొందరు బాధితులు కోరుతున్నారు.

## శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 266 వ జయంతి వేడుకలు



**పెనుగంచిప్రోలు,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 266 వ జయంతి సందర్భంగా పెనుగంచిప్రోలు మండలం లోని అని గండ్లపాడు గ్రామ శివాలయం లో అయ్యప్ప స్వామి సేవా సమితి అధ్యక్షులు శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయ మాజీ చైర్మన్ వాసిరెడి బెనర్జీ , సోమవారం గ్రామ ప్రజలతో కలిసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు వారి జయంతి ని రాష్ట్ర ప్రభుత్వం పండుగలా చేయమని జివో ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు కి, వాసిరెడ్డి బెనర్జీ , గ్రామ ప్రజలందరూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి వంశీయులు అత్తులూరి అచ్యుత రావు, శివాలయం ఛైర్మెన్ సాంబ య్య , కోలా రామారావు, పొందూరు శేఖర్, వెంకటేశ్వర రావు, ఉట్లు లక్ష్మ య్య, వెంకయ్య, గింజుపల్లి శ్రీనివాసరావు , వెంకట రమణ, పెంటయ్య, శర్మ , నాగేశ్వర రావు తదితర నేతలు పాల్గొన్నారు...

## శ్రీ శారదా విద్యాసంస్థల ఆధ్వర్యంలో వాలీబాల్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం



**నూజివీడు,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** నూజివీడు పట్టణంలోని శ్రీ శారదా హైస్కూల్ గ్రౌండ్లో వాలీబాల్ సమ్మర్ క్యాంప్ ఈరోజు (27-04-2026) నుంచి ప్రారంభమైంది. ఈ విషయాన్ని శ్రీ శారదా విద్యాసంస్థల చైర్మన్ కుప్పాల శంకరరావు తెలిపారు. ఈ క్యాంప్ను చైర్మన్ కుప్పాల శంకరరావు ప్రారంభించగా, వ్యాయామ ఉపాధ్యాయులు పుల్లారావు మరియు ఆదర్శబాబు పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగుతోంది. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యాయామ ఉపాధ్యాయుల వద్ద శిక్షణ పొందుతూ, మంచి క్రీడాకారులుగా ఎదగాలని చైర్మన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇబ్రాయలు, వ్యాయామ ఉపాధ్యాయులు సుగుణరావు, రవీంద్ర, స్వప్న, అలీ ఖాన్, ప్రభాకర్, పుల్లారావు, ఆదర్శ్, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు..

## ప్రజాప్రతినిధుల న్యాయస్థాన ఎపిపిగా తల్లాప్రగడ సుబ్బారావు



**విజయవాడ లీగల్,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** రాష్ట్రం మొత్తం మీద విజయవాడలో ఉన్న ఏకైక ప్రజాప్రతినిధుల న్యాయస్థానంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్గా తల్లాప్రగడ సుబ్బారావును నియమిస్తూ ప్రభుత్వం జి.వో. జారీచేసింది. 2026 నుండి మూడు సంవత్సరాలపాటు ఆయన సేవలందించనున్నారు. గతంలో 2022 నుండి 2025 వరకు కూడా యంపి/యంఎల్ఏ న్యాయస్థానంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్గా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్లో పూర్వపు/ప్రస్తుత యంపి, ఎమ్మెల్యేల క్రిమినల్ కేసులను ప్రభుత్వం తరపున వాదించనున్నారు. బెజవాడ బార్ అసోసియేషన్లో 1999వ సంవత్సరములో న్యాయవాదిగా ఎన్రోల్ అయిన సుబ్బారావు సీనియర్ న్యాయవాది వై.వి.హనుమంతరావు దగ్గర శిష్యరికం చేశారు. 2011లో సమైఖ్యాంధ్రప్రదేశ్లో విజయవాడలో హైకోర్టు బెంచి ఏర్పాటు చేయాలని 8రోజులపాటు ఆమరణ దీక్ష చేశారు. న్యాయవాదుల సమస్యలకై నిరంతరం పోరాటం చేశారు. హైకోర్టు మాజీ జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావుకు స్వయానా సోదరుడు కావడం గమనార్హం. ఆయన నియామకం పట్ల బిబిఎ అధ్యక్షులు విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ, గవర్నింగ్ బాడీ సభ్యులు, పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు.

## తిరువూరు లోని పెట్రోల్ బంకులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీ శా..




**తిరువూరు,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** జిల్లాలో ప్రతిరోజు 3 లక్షల లీటర్ల పెట్రోల్, 5 లక్షల లీటర్ల డీజిల్ కావాలి..దానికి అదనంగా మరో 10% అంటే 80 వేల లీటర్ల డీజిల్, పెట్రోల్ సప్లై చేస్తున్నాం. సోషల్ మీడియాలో చూసిన వారు ఎక్కడ రేట్లు పెరుగుతాయోఅని ఆందోళన చెందుతున్న ప్రజలు..నిన్న ఆదివారం కావడంతో ఐఓసీ, బిపిసిఎల్, హెచ్పీసీఎల్ మూతబడడంతో సంక్షోభం నెలకొంది. పది జిల్లాలకు మన ఎన్టీఆర్ జిల్లా నుండి డీజిల్,పెట్రోల్ సప్లై జరుగుతుంది..ఎక్కడ ఆయిల్ దొరకదోనని 100 రూ. అవసరం ఉన్నవారు 400 కొనుగోలు చేయడం వల్ల సంక్షోభం ఎక్కువైంది. ప్రజలకు ఒకటే విన్నపం చేస్తున్నామని అవసరం ఉన్న మేరకే వినియోగించుకోవాలని కోరారు. వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో ఉన్న 150 హార్వెస్టర్ తిరుగుతున్నాయి. లారీలు, కార్లు, ట్రాక్టర్ల కోసం ఎక్కువ నిల్వ చేసుకోవడం వలన రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. కావున రైతులకు మనమందరం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వైద్యం సేవలు, ఎమర్జెన్సీ సర్వీసెస్ కొరకు ప్రాధాన్యతనిస్తామన్నారు. ఆయిల్ కంపెనీలు అదనంగా సప్లై చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. జిల్లాలో ఉన్న 186 బంకుల్లో రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారుల సంయుక్తంగా పనిచేస్తున్నారు. జిల్లా కలెక్టర్కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందని తెలిపిన జిల్లా కలెక్టర్ జి లక్ష్మీ శా..

## ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలి

-జనసేన సీనియర్ నేత గంగాధర్



**కాకినాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** ఆపదలో ఉన్న వారికి ప్రతీ ఒక్కరూ తోచిన విధంగా సహాయం చేయాలని కాకినాడ జనసేన పార్టీ సీనియర్ నేత మచ్చా గంగాధర్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని 25 వ డివిజన్ లో ఇటీవల మృతి చెందిన కొత్తపల్లి బుల్లి సత్తియ్య కుటుంబానికి రెండు నెలలకు సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయ సాధన లో భాగంగా నా వంతు పేదలకు సహాయం చేస్తున్న అని తెలిపారు. ఇప్పటి వరకు 340 మందికి ఉచితంగా నిత్యావసర సరుకులు, సహాయ కార్యక్రమాలు చేశానని అన్నారు. ఈ కార్యక్రమం లో జనసేన డివిజన్ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు

## ఘనంగా భానోదయ పబ్లిక్ స్కూల్ 20వ వార్షికోత్సవం..



**కృత్తివెన్ను,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** భానోదయ పబ్లిక్ స్కూల్ 20వ వార్షికోత్సవం శీతనపల్లి సలోబిలో స్కూల్ ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ తిరుమాని సీతంబరం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సబ్ ఇన్స్పెక్టర్ ఎ.పైడిబాబ తెలుగుదేశం పార్టి సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో విద్య అనేది అందరికీ అవసరం అని విద్యుత్ తో పాటుగా విద్యార్థులు ఆటపాటలతో మానసిక ఉల్లాసాన్ని కలిగి మంచి చదువుకోవాలని వారు ఆకాంక్షిస్తూ కేరళ టీచర్లతో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న యాజమాన్యానికి, ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి...

# ప్రజలను బెంబేలెత్తిస్తున్న పలు హోటళ్లు,రెస్టారెంట్లు

● టిఫిన్ ప్లేట్లల్లో దర్శనమిస్తున్న ఈగలు,బొద్దింకలు. ● నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్న సంబంధిత శాఖ ల అధికారులు. ● ఆరోగ్య భద్రతా(ఫుడ్ సేఫ్టీ) అధికారులు పర్యవేక్షణ ఏది..? ● అధికారులు తీరు పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు. ● ప్రజల ఆరోగ్యంతో చేలాగాటమాడుతున్న పలు హోటల్, రెస్టారెంట్ ల యాజమాన్యం. ● వంట గ్యాస్ కొరత చొరవతో భారీ రేట్లు పెంచిన హోటల్ యజమానులు



**గన్నవరం, ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** పేరుగొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా గన్నవరం పరిస్థితి నెలకొంది. ఓ పక్క ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్,ఐటి సంస్థలు ఇంకా మరెన్నో పారిశ్రామిక సంస్థలతో అమరావతి రాజధాని కి కూతవేటు దూరంలో అభివృద్ధి పథంలో ముందున్న గన్నవరం లోని పలు హోటళ్లలో ,రెస్టారెంట్ లలో, పరిస్థితి ద్దుర్భరంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు . భారీగా అధిక రేట్లతో నాణ్యత లోపమైన ఆహారాన్ని ఇక్కడి హోటళ్లలో విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.పలు హోటళ్లలో ,రెస్టారెంట్ లలో నాసిరకం నూనెలు,పప్పు,ధాన్యాలు,బియ్యం, వంటలలో వాడుతున్నారని పలువురు బహిరంగంగానే వాపోతు న్నారు.ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు గా వ్యవహరిస్తున్నారని, పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చోద్యం చూస్తూ వ్యవహరించటం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.హోటళ్లలో,రెస్టారెంట్ లలో వంట గదులు దుర్భరంగా,దుర్వాసన వేదజల్లుతూ,అస్తవ్యస్తంగా మారాయని ,హోటళ్ల నుండి వెలువడే వ్యర్థాలను డ్రైనేజీలలో విడుదల చెయ్యడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు,గన్నవరం పరిసర ప్రాంతాలలో ఉన్న ఇలాంటి హోటళ్ల వలన అనేక మంది ఆసుపత్రుల పాలైన సంఘటనలు లేకపోలేదని గ్రామస్థులు అంటున్నారు. ఇదిలావుండగా పలు హోటళ్లలోని భోజన పదార్థాలలో ఈగలు,బొద్దింకలు, దర్శనమివ్వటం పరిపాటిగా మారింది ఓ వ్యక్తి ఇటీవల కాలంలో టిఫిన్ చేసేందుకు తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ సమీపంలోని ఒక హోటల్ కు వెళ్లగా ఇడ్లిలో బొద్దింక దర్శనమిచ్చింది.దీని గురించి అక్కడ సిబ్బందిని,యాజమాన్యంను అడుగగా సరైన సమాధానం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన లేక పోలేదు. గన్నవరంలో ఇలాంటి దుస్థితి ఏర్పడి పలు హోటళ్లు ప్రజారోగ్యంతో ఆటలాడుకుంటున్నప్పటికి అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించటం దారుణమని,ఉన్నతాధికారులు స్పందించి ప్రజల జీవితాలతో చేలాగాటమాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**గ్యాస్ కొరత సాగుతో సామాన్యుడి పై భారం..** ఇటీవల ఏర్పడిన ఇబ్బందులు కారణంగా కొన్ని రోజులు పాటు వంట గ్యాస్ దొరక్కుండా ఉంటటం అందరికీ తెలిసిందే. కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలెవ్వరూ ఇబ్బందులు పడకుండా ఉండాలని వెంటనే వంట గ్యాస్ కొరతను వెంటనే నివారించేందుకు చర్యలు తీసుకుని తగు జాగ్రత్తలు తీసుకున్నారు..కానీ ఇదే సాకుతో కొందరు హోటళ్ల యజమానులు అధిక రేట్లకు భోజనం పదార్థాలను పెంచి సామాన్యుడిపై భారం మోపుతున్నారు.

**ఆరోగ్య భద్రత(ఫుడ్ సేఫ్టీ) అధికారులు పర్యవేక్షణ ఎక్కడ...** ఇటీవల కాలంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న హోటళ్లు,రెస్టారెంట్ లపై ఎటువంటి తనిఖీలు చేసిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పలు ప్రధాన రహదారుల వెంబడి కొనసాగుతున్న న్యాడిల్స్ బండ్ల నుండి వస్తున్న వ్యర్థాలు,కళ్లలో పడి వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నమని చెబుతున్నారు.ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు,గన్నవరం లో ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందులుపట్ల చర్యలు తీసుకోవాలని,సమస్య ను పరిష్కరించాలని గన్నవరం ప్రజలు వేడుకుంటున్నారు.

# ఏ1 గ్లోబల్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు మీర్జా ఉస్మాన్ బెగ్ సేవలు మరువలేనివి..

● సంస్మరణ సభలో ఆయన సేవలను కొనియాడిన మాజీ మంత్రి ఆదిమూలపు, మాజీ ఎమ్మెల్యే అన్నా






**మార్కాపురం,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** ఏ వన్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు, స్వర్గీయ మీర్జా ఉస్మాన్ అలీ బేగ్ గారి సంస్మరణ ఆదివారం రాత్రి ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో బిసి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెనుక బడిన మార్కాపురం ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి ఉస్మాన్ బెగ్ చేసిన సేవలను వైసిపి మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ పార్టీ ఇంచార్జి అన్నా రాంబాబు లు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మొట్టమొదటి ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించిన స్వర్గీయ ఆదిమూలపు శామ్యూల్ జార్జ్ సలహాలు సూచనలతో తాము కూడా కళాశాలను ప్రారంభించామని ఏ వన్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ,న్యాయవాది మీర్జా షంషేర్ అలీ బేగ్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మరియు మున్సిపల్ శాఖల మాజీ మంత్రివర్యులు ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ మీర్జా ఉస్మాన్ బేగ్ మూడు తరాలు గాని,మా యొక్క మూడు తరాల నుండి గాని కుటుంబ సాన్నిహిత్యంతో కొనసాగుతూ వచ్చామని, ఎంతో స్నేహశీలంగా ఉండేటువంటి వారి మరణం పట్ల చింతిస్తున్నానని తెలియజేశారు. తాజా మార్కాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ ఉస్మాన్ బేగ్ తో ఉన్నటువంటి అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్ మాట్లాడుతూ ఉస్మాన్ బేగ్ గారిని సంఘమిత్రగా అభివర్ణించారు. వేలాదిమంది మైనారిటీ యువతకు మిగతా వర్గాల వారికి ఇంజనీరింగ్ విద్యను అందించినటువంటి గొప్ప దార్శనికుడు ఉస్మాన్ బేగని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర నాయకులు, శంషేర్ అలీ బేగ్ గారి వియ్యంకులు,మాజీ రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి, రాష్ట్ర పార్టీ వైద్యుల విభాగం కార్యదర్శి డాక్టర్ సయ్యద్ మక్బూల్ బాషా, రాష్ట్ర మాజీ ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ మేడా బదరీనాథ్, రాష్ట్ర పార్టీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ,ఇందిరా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ చైర్మన్ వెన్నా హనుమారెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం, డాక్టర్ మౌలాలి,జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షేక్ సైదా, డాక్టర్ మహబూబ్ బాషా, పివి కృష్ణారావు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.సోమయ్య , డికెఎమ్ రఫీ ,ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఎన్వి రమణ, సీనియర్ పాత్రికేయులు మూలా అల్లూరి రెడ్డి, రాష్ట్ర వైఎస్ఆర్ సీపీ నాయకులు బట్టగిరి తిరుపతిరెడ్డి పోరెడ్డి చెంచిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పిటిసి రంగారెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షుడు సలీం, పార్టీ నాయకులు రామడుగు రమేష్, విశ్రాంత ప్రిన్సిపల్లు అన్నపురెడ్డి వీరారెడ్డి ,రామిరెడ్డి, విశ్రాంత లెక్చరర్ పత్తి వెంగన్న, పార్టీ మహిళా నాయకురాలు విజయలక్ష్మి ,చెన్న లక్ష్మి ,షేక్ మల్లిక లతోపాటు అనేకమంది మీర్జా ఉస్మాన్ బేగ్ గారి అభిమానులు ఈ సంతాప సభలో పాల్గొని వారికి మూకుమ్మడిగా నినాదాల ద్వారా జోహార్లు అర్పించారు.

# అర్జీదారుల సంతృప్తే ఆర్జీ పరిష్కారానికి గీటురాయి

● ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి పరిష్కరించాలి. ● జిల్లాస్థాయి పిజిఆర్ఎస్ కు 134 అర్జీలు ● జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా



**విజయవాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** అర్జీదారుడి సమస్యకు సరైన పరిష్కారం చూపడమే అర్జీ పరిష్కారానికి గీటురాయని ప్రతి ఆర్జీని క్షుణంగా పరిశీలించి పునరావతం కాకుండా సమస్యను సమస్యను పరిష్కరించాలని కాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమ వారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. లక్ష్మీనరసింహం తో కలసి అర్జీదారుణీ నుండి జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ఆర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ ఆర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాల్సిందేన న్నారు. నిబంధనలను పాటిస్తూ ఆర్జీదారుడు. సంతృప్తి చెందేలా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సమస్యకు సంబంధించిన శాఖ జిల్లా స్థాయి అధికారి ప్రత్యేక దృష్టి సారించి సమస్యకు స్పష్టతతో కూడిన పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా పారదర్శకంగా పరిష్కారం ఉండాలని, గడుపుతీరిన ఆర్జీలు ఏ స్థాయిలోను పెండింగ్ ఉండరాదన్నారు . సంతృప్తి కరంగా పరిష్కారం చూపితే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందనే సందేశం ప్రతి అధికారి దృష్టిలో ఉండాలన్నారు. జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో అర్జీదారులు వినతులను సమర్పిస్తారని, ఆయా ఆర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాల్సిన భాధ్యత అధికారులపై ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 134 అర్జీలు అందగా.. వీటిలో ఎం ఏ యు డి 80, పోలీస్ శాఖకు 30. పంచాయతీరాజ్ శాఖకు 19, హెల్త్ 8, రెవన్యూ 7. ఎపిసిపిడిసిఎల్ 7. అర్ డబ్ల్యూఎస్ 5, విద్య 4, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు 4, వ్యవసాయం 3, పశుసంవర్థక శాఖ 3, ఏపీ ఎస్ డబ్ల్యూ ఆర్ ఇ ఐ ఎస్ 2. సమన్వయ విభాగం ( కలెక్టరేట్) 2, దేవాదాయ 2, ఎల్ డి ఎం 2, ఏపీ ఆర్టీసీ, పౌర సరఫరాలు, విభిన్న ప్రతిభావంతులు, డీఆర్ డీ ఏ, మత్స్య , ఆహార భద్రత, ఐసిడిఎస్, అటవీ, కార్మిక, మెప్మా, గనులు, మద్య నిషేధ అండ్ ఎక్సైజ్, సాంఘిక సంక్షేమం శాఖలకు సంబంధించి ఒక్కో ఆర్జీ వచ్చాయన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టిపెట్టి క్షేత్రస్థాయి అధికారులతో పటిష్ఠ సమన్వయంతో జాప్యానికి తావులేకుండా పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి. క్షేత్రస్థాయి అధికారుల సహకారంతో నిర్దేశ గడువులోగా ఆర్జీలు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా సూచించారు.

# భక్తులతో కోలాహలంగా మారిన నేలకొండపల్లి

● వైభవంగా సుందరేశ్వర అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు





**పెడన,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా పెడన మండలం నేలకొండపల్లి గ్రామం బుధవారం జరగనున్న సుందరేశ్వర అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సోమవారం "పాంచహ్నిక దీక్ష" లోభాగంగా మూడవరోజు శైవాగమ కోవిదులు శతాధిక ప్రతిష్ఠా చార్యులు బ్రహ్మశ్రీ గూడూరు రామకృష్ణ శర్మ శైవాగమ పండితుల ఆధ్వర్యంలో 54 పుణ్య దంపతులతో ఘనంగా ప్రారంభమయ్యాయి వేదస్వస్తి విఘ్నేశ్వర పూజ పుణ్యాహవాచన పంచగవ్య ప్రాశన మార్జనలు శాంతి కుంభస్థాపన బింబ శుద్ధి విశేష మూలమంత్ర హోమములు బలిహరణ నీరాజన మంత్రపుష్పములు తీర్థప్రసాద వితరణ ధాన్యాదివాసం రుద్రహోమం అయ్యప్ప మూలమంత్ర హోమములు నీరాజన మంత్రపుష్పములు చతుర్వేద పారాయణ తీర్థప్రసాద వితరణ జరిగింది. పూజా కార్యక్రమాల్లో పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ తోపాటు టీడీపీ నాయకులు అర్జా నగేష్ సలపాటి ప్రసాద్ శీరం ప్రసాద్ పాల్గొన్నారు. చివరి రోజు భక్తులు భారీ ఎత్తున పాల్గొనే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా కమిటీవారు ఏర్పాటు చేస్తున్నారు ఇప్పటికే ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో భక్తులు సేద తీరుతున్నారు.మండు టెండలను సైతం లెక్కచేయకుండా జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు.

# ఆర్ జేటీసీ వడ్డే సుందర్‌ను కలిసిన ఉద్యోగ సంఘ నాయకులు

● ఖాళీల భర్తీలు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేసిన జోనల్ అధ్యక్షుడు యం. రాజుబాబు.



**విజయవాడ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** జిల్లాలోని అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సత్వర సేవలు అందించడంతో పాటు శాఖ లక్ష్యాలను అధిగమించే విధంగా కృషి చేయాలని రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వడ్డే సుందర్ పేర్కొన్నారు. స్థానిక బందరు రోడ్డులోని రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయంలో సోమవారంనాడు రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వడ్డే సుందర్‌ను రవాణాశాఖ నాన్-టెక్నికల్ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం. రాజుబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జోన్-2 పరిధిలో సీనియర్ అసిస్టెంట్ల పదోన్నతుల అంశాన్ని ప్రధానంగా జోనల్ అధ్యక్షుడు యం రాజుబాబు ప్రస్తావించారు. రాజుబాబు మాట్లాడుతూ గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ల పోస్టుల భర్తీ చేయకపోవడంతో ఉద్యోగులపై కార్యాలయాల్లో పనిభారం పెరిగిందని, జూనియర్ అసిస్టెంట్ల నుండి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తే, వారి స్థానాలలో కొత్తగా జూనియర్ అసిస్టెంట్లు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. అర్హత కలిగిన జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్ల గా పదోన్నతులు కల్పించి, ఖాళీలను భర్తీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై ఇప్పటికే పలుమార్లు విన్నపాలు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేస్తూ, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. జోనల్ స్థాయిలో ఉద్యోగుల సమస్యలు, సర్వీస్ సంబంధిత అంశాలు కూడా త్వరితగతిన పూర్తి చేస్తున్నందుకు ఆర్ జేటిసి కి ధన్యవాదాలు తెలియజేసారు. అదే విధంగా పదోన్నతులు కల్పించి ఖాళీలను భర్తీ చేయాలని ఆయన కోరారు. అనంతరం వినతిపత్రాన్ని సమర్పించారు. ఆర్ జేటిసి వడ్డే సుందర్ మాట్లాడుతూ సీనియర్ అసిస్టెంట్ల పదోన్నతుల అంశం తన దృష్టిలో ఉందని, అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేసి త్వరలోనే నిర్ణయం తీసుకొని పదోన్నతులు కల్పించేలా చర్యలు చేపడతామని ఆయన అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఏ అంశమైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. శాఖకు మంచి పేరు తీసుకురావాలంటే అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యతగా భావించాలని ఆయన అన్నారు.ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడం రవాణాశాఖ ముఖ్య లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు ఎం. రాజుబాబుతో పాటు జోనల్ కోశాధికారి కె. రామచంద్రరాజు, జి.ఆర్. శ్రీకాంత్, మణిస్విని, రవితేజ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లా పేరు "కాటంరాజు జిల్లా"గా మార్చండి

-ముఖ్యమంత్రికి అఖిల భారత యాదవ మహాసభ వినతి



**విజయవాడ, ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** మార్కాపురం జిల్లా పేరును "కాటంరాజు జిల్లా"గా మార్చాలని ముఖ్యమంత్రి కి తమ డిమాండ్ తెలియచేయాలని అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు చింకా నారాయణరావు మరియు ప్రధాన కార్యదర్శి పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితర నాయకులు కలెక్టర్ కార్యాలయం లో జిల్లా రెవెన్యూ అధికారి కి వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా చింకా,పెద్దిబోయిన లు మాట్లాడుతూ మార్కాపురం ప్రాం తానికి చెందినట్లు కనపడుతున్న కాటమరాజు మూడు రాష్ట్రాలలో పరిపాలన కోన సాగించి ప్రజారంజకంగా పరిపాలన చేశారన్నా రు.పశుపోషణకు,రక్షణకు కాటమరాజు విశేష కృషి చేశారని పేర్కొన్నారు.రాజు దేవుడు అయ్యి గుడులు నిర్మాణం అయ్యిన సంఘటన లు ఎక్కడ లేవని, కాటమరాజుకు మాత్రమే దేవాలయా లు ఉన్నాయన్నారు.జయానరాజు చారిత్రాత్మక మరియు సాంస్కృ తిక ప్రతీక అని తెలిపారు. దేవుడైన కాటమరాజు చరిత్ర సజీవం గా ఉండాలన్నారు.కాటమరాజు పేరు మీద జిల్లా ఉండటం దేశంలోనే అత్యధిక జనాభా ఉన్న బిసి సామాజిక వర్గాల గౌరవం పెరుగుతుందని వారు ఆ లేఖలో పేర్కొనట్లు తెలిపారు. తాము అందించిన లేఖ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి సమర్పించి, జిల్లా పేరు మార్పు పై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు నాయకు లు చింకా నారాయణ,పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ లు తెలిపారు.

# నగరపాలక సంస్థకు 27 వినతులు

: ఇంచార్జి కమిషనర్ శారదా దేవి



**తిరుపతి,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 27 వినతులు వచ్చాయని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 23మంది వినతులు సమర్పించగా, 4 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తెలుగుగంగ నీరు సక్రమంగా పంపిణీ చేయాలని, లీలా మహల్ కూడలి వద్ద కాలువ కోసం తవ్వారు శుభ్రం చేయాలని, గొల్లవాణిగుంటలో ఆక్రమనలను అపాలని, కోర్లగుంట శుభాష్ నగర్లో అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలని, లీలామహల్ సమీపంలో ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిష్కరించాలని, అన్నమయ్య హోటల్ వలన ఇబ్బందిగా ఉంది పరిసగకరించాలని, దోమలు ఎక్కువగా ఉన్నాయని, బిపిఎస్, ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

# కోనేటిని పరిరక్షించండి

● ప్రజా వేదికలో కలెక్టర్ కు వినతి పత్రం అందజేత

● హిందూ సంఘాల ఆధ్వర్యంలో రెండో రోజుకు చేరిన ఆందోళన కార్యక్రమాలు



**నందిగామ,ఏప్రిల్ 27 (వార్తాప్రభ) :** స్థానిక పాత బస్టాండ్ లో ఉన్నటువంటి శ్రీ శుక శ్యామలాంబ సహిత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి పురాతనమైన కోనేరు పుష్కరిణి చుట్టుప్రక్కల ఆక్రమణలను వెనువెంటనే తొలగించి తక్షణం అభివృద్ధి చేసి స్వామి వార్ల శుభ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించాలని కోరుతూ హిందూ సంఘాలు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా కు వినతి పత్రం అందజేశారు.అధికారులు పాలకులు వెంటనే స్పందించని యెడల త్వరలో నందిగామ మరియు పరిసర గ్రామాల హిందూ సోదరులను కలుపుకొని కార్యాచరణ ప్రకటిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు తొర్లికొండ సీతారామయ్య,మునగంటి కామేశ్వరరావు,పారేపల్లి సాయిబాబు, వందేమాతరం అశోక్,అడపా స్వామి, పులిపాటి లక్ష్మణరావు, మహంకాళి వెంకన్న గురుస్వామి, ఈపూరి సురేష్ , చిరుమామిళ్ళ శ్రీనివాసరావు, వై.యస్.బాబు, కొల్లూరి వెంకటేశ్వర రావు,నకరికంటి నరేష్, తుటారి కృష్ణ,యరగొర్ల లక్ష్మణ్,కొట్టే బద్రి, రామిశెట్టి సతీష్,పబ్బతి గుప్త, కుంచం లక్ష్మీనారాయణ,చవట నాగేశ్వరరావు, కొప్పు మురళీ, ఊటుకూరు సత్యనారాయణ, వినుకొల్లు రమణ, కొమ్మినేడి సత్యనారాయణ,నూతక్కి విజయ్, కొత్త నాగ ప్రభాకర్, చింతా రమేష్, బాణాల నరసింహారావు, బాదర్ల ఆంజనేయులు ,చందు,లారీ ఆఫీస్ భాను,బుర్రా వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188